మాస్టర్ సి.వి.వి.


# నూతన యోగము




మాస్టర్ పార్వతీకుమార్

# ధనిష్ఠ ప్రచురణలు














ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

Phone : 0891-2701531 www.dhanishta.org info@dhanishta.org

మాస్టర్ సి.వి.వి.

# నూతన యోగము

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2007 ప్రతులు : 500

ద్వితీయ ముద్రణ : 2009 ప్రతులు : 1,000

తృతీయ ముద్రణ : 2018 ప్రతులు : 1,000

© ధనిష్ఠ

వెల : రూ॥ **40-00**

*ప్రాప్తిస్థానము :*

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**
15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531, 2509154.

Website : www.dhanistha.org.
info@dhanistha.org.
ISBN : 978-81-89467-86-9

*ముద్రణ :*

**వంశీ కృష్ణ ప్రింటర్స్,**
విశాఖపట్నం - 530 016.
ఫోన్ : 0891-6617988

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్య వాయువు. ధన మనగ దివ్య సంపద. అది కేవలము డబ్బు కాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధన మనిరి. ఆర్షవిజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు 'ధనిష్ఠ' 1992లో జనించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థ కర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన ప్రశాంత వాతావరణమును– "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

మాతృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోద నము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 33 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమ గురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్‌గారు.** వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్య జీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **“డాక్టర్ ఆఫ్ లెటర్స్”** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారి నప్పుడే దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, “మానవ సేవయే మాధవ సేవ” అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింప జేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింప జేయు

వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాది మందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాలరనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించు చున్నారు. పరమ గురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# ముందుమాట

యోగవిద్య సనాతనమే అయిననూ పరిణామ కథలో అదియునూ పరిణామము చెందుచుండును. హఠ యోగము నుండి రాజయోగమునకు క్రమశః యోగవిద్య పరిణతి చెందినది అనుటలో సందేహములేదు. యుగముల మార్పు, జీవన విధానముల సరళిని బట్టి ఎప్పటికప్పుడు విలువలను కోల్పోకుండ, విధానములు మార్చు కొనుట సృష్టియందు వృద్ధికి కారణముగ గోచరించును. ఇట్లు మారు చున్న కాలము, జీవన విధానమును బట్టి తగు విధముగ మార్పు చెందుచున్న విద్యలు ఆ కాలమున కనుగుణమై రాణించ గలవు.

నేడు యోగసాధన చేయుటకు జింక చర్మము, పులి చర్మములు అవసరము లేదు. అడవులకు పో నవసరమూ లేదు. పద్మాసనముననే కూర్చుండవలెనను ఆంక్ష కూడా లేదు. దుస్తుల, ఆచారముల విషయములందు కూడా యోగ మెప్పుడునూ ఆంక్షలు పెట్టలేదు. అంతమాత్రమున మౌలిక సూత్రములను త్యజించనూ లేదు. యమ - నియమాది గుణసంపత్తి అప్పుడునూ యిప్పుడునూ అవసరమే. ప్రస్తుత కాలమున పెనుమార్పులు గత 150 సం॥లుగా గమనింపనగును. శాస్త్ర పరిశోధనముల కారణముగ ఆధునిక యుగమున జీవనము విపరీతమగు మార్పులకు గురియైనది. వేగము

పెరిగినది. దూరము తగ్గినది. మేధస్సు యిదివరకు కన్నా చురుకుగ పనిచేయు చున్నది.

కాలధర్మమును, యుగధర్మమును అనుసరించి దైవమే నూతన యోగము సంకల్పించినదని, తానే తన వాహికల నెంచుకొని ఈ యోగము నిర్వర్తింపబడునని మాస్టర్ సి.వి.వి. గారు తెలిపినారు. బ్రహ్మమే సంకల్పించినపుడు కాదనగలవా రెవరు? బ్రహ్మము యొక్క సంకల్పమే నూతన యోగమునకు బీజమైనది. ఇది సనాతన యోగమునకు విరుద్ధము కాదు. ఈ యోగమందలి నూతనత్వము తెలియవలెనన్నచో మాస్టరుగారు పదే పదే పలికిన వాక్యములు అవగాహన చేసుకొనవలెను. 33 అంశములుగ అట్టి విషయములు ఈ పుస్తకమున వివరించుట జరిగినది. మాస్టర్ సి.వి.వి. గారు అందించిన యోగమును సాధనాపరముగ స్వీకరించిన వారికి ఈ పుస్తకమునందలి అంశములు ఎంతయో తోడ్పడగలవు అని నా విశ్వాసము.

ఈ తృతీయ ముద్రణమును **చి॥ ఫణికిరణ్** సంస్మరణార్థం వారి తల్లిదండ్రులు **శ్రీ R.C.S. శర్మ – శ్రీమతి పద్మావతి దంపతి**, మంగళగిరి వారు సమర్పించిరి.

**– పార్వతీకుమార్**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | సమగ్రత్వము | ... 13 |
| 2. | భౌతికపు విలువ | ... 16 |
| 3. | మాస్టర్ నమస్కారమ్ | ... 19 |
| 4. | NEW DIRECT LINE | ... 22 |
| 5. | ఆది – ఆత్మ | ... 24 |
| 6. | కేంద్రపు మార్పు | ... 25 |
| 7. | అనంత ప్రాణము | ... 27 |
| 8. | గుణాతీతము–నిర్గుణము–గుణాత్మకము | ... 30 |
| 9. | నూతన పదములు | ... 32 |
| 10. | భృక్తము – రహితము – తారకము | ... 37 |
| 11. | M.T.A. - A.T.M | ... 39 |
| 12. | విశిష్ట ప్రయోగము | ... 41 |
| 13. | నూతన శరీర నిర్మాణము | ... 45 |
| 14. | ప్రార్థన – కోర్సులు – సర్దుబాట్లు | ... 47 |
| 15. | ప్రార్థన – ప్రాణము | ... 49 |
| 16. | బ్రహ్మమే గురువు | ... 50 |

17. యోగము – తెగువ ... 52

18. సృష్టి – అపరిపూర్ణత ... 54

19. ప్రార్థన – మగత ... 56

20. మగత – పరిధి – కేంద్రము ... 58

21. ప్రజ్ఞ – కేంద్రము – పరిధి ... 60

22. ప్రార్థన – స్థితులు – అవస్థితులు ... 64

23. ప్రాణా ట్రీట్–వి.పి.ఎస్.–కుండలిని ఖాళీ ... 66

24. LIFT UP ... 68

25. మాస్టరుగారి శ్వాస ... 70

26. పరిపూర్ణత్వము ... 72

27. 'చందు' కుండలిని ప్రవేశము ... 74

28. కర్మ – సమర్పణము – సిద్ధి ... 77

29. MILLER FORM CENTRE ... 79

30. సైన్సు – యోగము – పరిష్కారము ... 81

31. కదలిన బ్రహ్మము ... 84

32. యోగార్హతలు ... 86

33. సూచన ... 92



మాస్టర్ సి.వి.వి.

# మాస్టర్ సి.వి.వి.
# నూతన యోగము

## 1. సమగ్రత్వము

యోగమత్యంత ప్రాచీనము. సృష్టి యారంభము నుండియు యోగమార్గము గూడ నున్నది. చతుర్ముఖ బ్రహ్మకు సృష్టి ఆరంభము ననే నారాయణుడు యోగబోధను గావించెనని పురాణములు చెప్పు చున్నవి. యోగవిద్య కధిదేవత ఆదిశేషువు. పతంజలి మహర్షి కూడ ఆదిశేషువు అవతారముగనే తెలియ జెప్పుదురు. ఆదిశేషువు సృష్టి ఆరంభము నుండి అంతము వరకు కాలరూపమున చుట్టలు చుట్టలుగ నుండు దైవము. అతడు అనంతుడే. నారాయణుడే. నారాయణుని కాలరూపమే ఆదిశేషువు.

యోగవిద్యకు ఆదిశేషువు గురువై యుండగ సమాధి గమ్యమై యున్నది. సమాధి నిద్రవంటి స్థితిగాని, నిద్ర కాదు. చైతన్యముతో గూడిన నిద్రవంటిది. దీనిని తురీయస్థితి యందురు. సృష్టి యంతయు నారాయణుని రూపముగను, అందు వసించు నారాయణుడు శేష తల్పమున నిద్రవంటి స్థితిలో లక్ష్మి (ప్రకృతి) తోను, మాయతోను

కూడియున్నట్లుగ పురాణములు తెలుపును. అభిలాష కలవానిగ తెలుపును. ఇందు శేషుడు కాలరూపము. ప్రకృతి సృష్టిరూపము. మాయ అజ్ఞాన రూపము. అభిలాష అగ్నిరూపము. ఇవి యన్నియు నారాయణుని యందు లయమై యుండి సృష్టి యారంభమున క్రమమున వ్యక్తమగును. ఇట్టి నారాయణ స్థితిని సమాధి యందురు.

యోగమున సమాధి స్థితియందు సిద్ధు డనుభవించు స్థితి గూడ యిట్లే యుండును. అతడు నిద్రవంటి స్థితియందుండును గాని, చైతన్యవంతుడే. అట్టి వాడే సమాధి కర్హుడు. సమాధినుండి అతడు అభిలాషను, కాలమును, ప్రకృతిని, మాయను సాధనము లుగ గొని జీవుల ననుగ్రహించుచుండును. ఇట్టి యోగస్థితి భౌతిక శరీరముండగనే సిద్ధింపజేసుకొనవలెను. భౌతికమునకు నష్టము కలుగకుండ ఏడు లోకములందు నారాయణుడు జీవించు చున్నాడు. అది యతని పరిపూర్ణత్వము. ఇట్టి పరిపూర్ణత్వము జీవునికి కూడ కలుగవలెను అనునది మాస్టరు సి.వి.వి. గారి యోచన. అది, వారికి మానవులపై గల కారుణ్యమును తెలియ జేయును. .

నారాయణుడు భౌతికము వరకు అంతట వ్యాపించి యుండగ, పరిపూర్ణ సిద్ధుడు అట్లేల యుండరాదు? కేవలము సూక్ష్మ దేహములు, దివ్యదేహములు ఆధారముగనే ఎందుకుండవలెను? అట్లుండుట పరిపూర్ణము కాదు కదా! భౌతికము వరకు దివ్యత్వము అవతరించ కలదు గనుక సిద్ధులు గూడ యట్లే యుండవలెనని మాస్టరు సి.వి.వి. గారి సంకల్పము. ఈ సంకల్పము ఆదికారణుడైన

పరమ పురుషునిదే. అతడే అట్లు సంకల్పించి మాస్టరుగారు వాహికగా ఈ సమగ్ర యోగమును ప్రతిష్ఠించుటకు పూనుకొనెనని, తత్కారణ ముగ, తానందించు యోగము నూతనమని మాస్టరు సి.వి.వి. గారు తెలిపియున్నారు.

## 2. భౌతికపు విలువ

ప్రస్తుత మందుబాటులో యున్న యోగమార్గము లందును, తంత్ర, మంత్ర, జప, ధ్యానము లందును మానవుడు పొందదగిన గమ్యస్థాన మొకటియే. అది ఉన్నతావస్థలో మహదానందమును పొందుట. ఇది పరిణామక్రమమున జీవులకు లభ్యము కాగలదు. యోగవిద్య శీఘ్రగతిని తత్సిద్ధిని అందించగలదు. మానవ ప్రకృతిలో అంతర్హితమైన శక్తులను మేల్కొల్పి, వాని సహకారముతో మానవ చైతన్యమును ఉన్నతావస్థలో స్థిరపరచి, ఆనందమును అనుభవింప జేయుటయే యోగవిద్య పరమావధిగ గోచరించును.

యోగసాధన సాగుచున్న సమయమున మానవుని యందలి దేహ కోశములలో విశేషములగు మార్పు లనేకములు జరుగును. జరుగుచున్న మార్పుల ఒత్తిడికి భౌతిక శరీరము తట్టుకొనలేక, శక్తి లేక కొన్ని అనివార్యమగు అస్వస్థతలను పొందును. మహాత్ము లందరి జీవితములందు యిట్టి అస్వస్థత భౌతికమున కేర్పడుట సామాన్యముగ గోచరించు విషయమే. శ్రీ రామకృష్ణునకు, శ్రీ రమణ మహర్షికి, శ్రీ అరవిందులకు, ప్రస్తుత కాలమున శ్రీ సత్యసాయికి యిట్టి అస్వస్థతలు ఏర్పడినవని జనులెరిగిన వాస్తవము. ఉదాత్తమగు

స్థితుల ననుభవించునపుడు వాని ఒత్తిడి భౌతికముపై నుండుట సహజము. తత్కారణముగ ఒత్తిడిని భరింపజాలక స్థూల శరీరము బిగువు, బలము కూడ కోల్పోవుట సహజము. యోగము సిద్ధించు కొలది స్థూలదేహమునకు ఏదో ఒక విధముగ నష్టము కలుగుచునే యున్నది. పరిపూర్ణ సిద్ధియందు నష్టముండరాదు. శ్రీకృష్ణుని శరీరము 126 సంవత్సరములపుడు కూడ కౌమార స్థితిని కోల్పోన లేదు. అట్లే పరమగురువులు మైత్రేయులును. వీరు పరిపూర్ణులు. యోగమట్టి పరిపూర్ణ స్థితి ననుగ్రహింపవలెను గాని, కొంత సిద్ధిని పొందుటకు, కొంత నష్టము వాటిల్లరాదు.

యోగసాధనలో స్థూల శరీరము ఉపేక్షింపబడ రాదనియు, స్థూలమునకు క్లేశములు కలుగరాదనియు మాస్టరుగారి సంకల్పము. స్థూల శరీరమును విడువనిదే సమగ్ర ముక్తిని పొందలేమను సిద్ధాంతములు మాస్టరుగారి దృష్టిలో పరిపూర్ణములు కావు. స్థూలముతో కూడి, సమస్తకోశములు పటిష్ఠముగ నుండి, దివ్య చైతన్యమును సహస్రారము నుండి మూలాధారము వరకు పరి పూర్ణముగ అనుభూతి చెందుచు జీవించుట పరిపూర్ణత్వము. అదియే సమగ్రయోగము. అదియే మాస్టరుగారు తెలుపు నూతన యోగము. ఏడంతస్తులు పరిపూర్ణముగ నుండు భవనమే సమగ్రము గాని, పై అంతస్తులు బాగుగ నుండి క్రింది అంతస్తులు బలహీన ముగ నుండుట సమగ్ర మనబడదు. మాస్టరుగారి యోగమున కారణ (వజ్ర) శరీర మెంత విలువైనదో, భౌతిక శరీరము కూడ

అంత విలువైనదే! "సౌఖ్యము లుండవలెను. సౌకర్యము లుండ వలెను. యోగమార్గమున కవి అవరోధములు కావు. యోగులు భోగులుగ నుండుట ఋషిప్రోక్తమే. జనకుడు, శ్రీకృష్ణుడు అట్టి వారు" అనునది మాస్టరుగారి యోగమార్గము.

# 3. మాస్టర్ నమస్కారమ్

పూర్వ యోగసాధనలలో ఎట్టి ఔన్నత్యమును సంపాదించి నను ఒక స్థితిలో నున్నప్పుడు, యితర స్థితులలో ఏక కాలమున సంబంధము లేకపోవుట జరుగును. అనగ బుద్ధిలోకములో నున్నప్పుడు భౌతిక లోకమున నుండకపోవుట, భౌతికములో నున్నపుడు బుద్ధిలోకములో నుండలేకపోవుట సామాన్యము. అన్ని లోకములలో ఏక కాలమున నుండుట పరిపూర్ణ యోగము. అంతర్యామి యట్లే ఉన్నాడుగదా! యోగమార్గమున జీవుడు గూడ యట్లే వ్యాప్తి చెందవలెనుగాని స్థితి మార్పుచెందుట కాదని మాస్టరుగారి భావన. దీనిని మాస్టరుగారు పరిచ్ఛిన్న యోగమని, అపరిపూర్ణ యోగమని సంబోధించినారు.

అపరిచ్ఛిన్న జీవితమునకును, అపరిచ్ఛిన్న జ్ఞానమునకును MTA సంకల్పించినదనియు, దానికి ఒక కేంద్రము కల్పించుటయే పనిగా పెట్టుకొనిన దనియు మాస్టరుగారు సూచించినారు. ప్రస్తుతము గల మానవ ప్రకృతిలో ఈ అపరిచ్ఛిన్నతను సాధ్యపరచునట్టి పరిస్థితులు లేవు గనుక దీనిని నూతన సృష్టి యనిరి. అనగా సృష్టి యందు నూతనమని యర్థము. జరుగుతున్న సృష్టియందు

నూతనత్వము ఆదికారణుడైన పరమ పురుషుడే సంకల్పించవలెను. దానినే మాస్టరుగారు MTA అనిరి. MTA అని సాధారణ ముగా పిలువబడు ప్రజ్ఞను ATM అని మాస్టరుగారు అనినారు. MTA వాహిక. ATM అందు ప్రవహించు నూతన సంకల్పము. ATM అనగా "ఆది టర్న్‌డ్ మాన్" (Adi Turned Man). ఈ నూతన సంకల్పమే నూతన సృష్టికి, నూతన యోగమునకు, నూతన యుగము నకు పునాది అని తెలియవలెను.

ఏ మానవ స్వరూపము ఈ నూతన విధానమునకు అధిష్ఠాత అయ్యెనో, ఎవరియందు ఈ నూతన యోగము కేంద్రీకరించుకొని, ఎవరి ద్వారమున వ్యాప్తిచెందుచున్నదో ఆ మహాపురుషుని 'మాస్టర్' అని పిలుచుట జరుగును. ఈ నూతన సంకల్పము సృష్టియందలి కుండలిని చైతన్యమార్గమున పయనమై, మానవ కుండలినిని స్పృశించుట జరుగును. కుండలిని చైతన్యము ప్రకృతి యొక్క సప్తలోక నిర్మాణమునకు హేతుభూతమగు మూలకందమై పూల దండయందలి దారమువలె యున్నది. దారమెట్లు అన్ని పూవుల నుండి సాగుచున్నదో, కుండలిని కూడ యట్లే అన్ని లోకముల నుండి సాగుచు మానవ దేహమున స్థిరపడి యున్నది. కావున అపరిచ్ఛిన్న, పరిపూర్ణయోగ సంకల్పముకూడ ఈ మార్గముననే ప్రవహింపజేసి, మానవ కుండలినిని ప్రచోదనము గావించుట మాస్టరుగారి యోగమున ఒక ప్రక్రియ. ఇచ్చట కుండలినిని ప్రచోదనము చేయునది ఆది బ్రహ్మమే. ఈ మార్గమునకు ఆది బ్రహ్మమే గురువుగ నిలచి

యున్నాడు. అందులకే ప్రార్థన సమయమున 'మాస్టర్ నమస్కారమ్" అనుట. దానినే కొందరు సాధకులు 'నమస్కారమ్స్ మాస్టర్' అను చున్నారు. ఆదిబ్రహ్మము గురువుగా గల యోగమిది. ప్రచోదనము చేయువా డాదిబ్రహ్మమే. మాస్టర్ సి.వి.వి. ఆ బ్రహ్మమునకు మొదటి వాహికగా నిలచి యున్నారు. సరాసరి బ్రహ్మమే జీవులను ప్రచోదనము కావించు చున్నాడు గనుక దీనిని నూతన యోగమనిరి.

# 4. NEW DIRECT LINE

సృష్టికి మూలముగ నిలచిన దైవము ప్రకృతికి సహకరించుట జరుగును. ప్రకృతి దివ్యసహకారమున త్రిగుణముల నేర్పరచుకొని సృష్టిలోకములను అల్లిక చేయును. సృష్టిలోనికి జీవులు ప్రకృతి అల్లిక నుండియే దిగివచ్చు చుందురు. దైవము గూడ ఆ మార్గమును స్వీకరించగలడు. సిద్ధులు, సాధ్యులు, మహాపురుషులు ఆ మార్గము ననే జీవులను ఉద్ధరించుట చేయుచుందురు. దైవము సర్వ స్వతంత్రుడు. అతడు సృష్టికి సహకరించు చున్నప్పటికిని, అవసర మగుచో తన మాయ నాధారము చేసుకొని తానే స్వయముగ దిగి రాగలడు. అట్లతడు దిగివచ్చుటకు ఏ శక్తులును విఘ్నములు కావు. అట్లు దిగివచ్చునపుడు దేవతలు, ఋషులు, లోకపాలకులు ఆ అవతరణమును గుర్తింపలేరు.

ఉదాహరణకు శ్రీరాముడుగా దైవము దిగివచ్చినపుడు ఆ విషయము దేవతలకును, ఋషులకును తెలిసినది. శ్రీరాముడు తెలిసిన మార్గమున దిగివచ్చెను. అనగా ప్రకృతి మార్గమున ఋషులు, దేవతలు, లోకపాలకులు సహకరింపగా దిగివచ్చెను. అందులకే రాముడు దైవమని, రావణ సంహారమున కవతరించె నని దేవతలు, ఋషులు తెలిసియుండిరి. నిజమునకు రామాయణమున విశ్వామిత్ర మహర్షి, వశిష్ఠ మహర్షి, అగస్త్య మహర్షి రాముని అవతార

ప్రయోజనమునకు దారులు వేసినారు. అట్లే యింద్రాది దేవతలు గూడ రాక్షస సంహార మార్గమున రాముని నడిపించినారు.

కాని శ్రీకృష్ణుని అవతారము అట్లు గోచరింపదు. అతడు భగవద్గీతలో నుడివిన విధముగ ఆత్మమాయచే తనను తాను సృష్టించుకొనెను. నారదుడు, సనత్కుమారుడు ఆదిగా గల ఋషులకు తప్ప, యితరుల కెవ్వరికిని శ్రీకృష్ణ జననమును గూర్చిన రహస్యము తెలియదు. అందువలననే సృష్టికర్త యగు చతుర్ముఖ బ్రహ్మ, సృష్టి రక్షకుడగు ఇంద్రుడు భంగపడుట జరిగినది. ఇక జ్ఞానులు, మునులు, యోగుల మాట చెప్పనేల. ఎవ్వరికిని అందక, సమకాలికమగు ఏ సిద్ధాంతములకు పట్టుబడక, తనదైన మార్గమున ధర్మ సంస్థాపనము గావించి, వివిధములగు యోగమార్గ సిద్ధాంతములను సంస్కరించి జీవులకు మోక్షమార్గము చూపినాడు.

అదేవిధముగ పరబ్రహ్మమే తనకు తానుగ సంకల్పించుకొని శారమేయ మండలము ద్వారా, తోకచుక్క నాధారముగగొని భూమికి చేరుట జరిగినది. సర్వ స్వతంత్రుడైన ఆదిపురుషుని మూల ప్రకృతిగాని, ఆమె ఏర్పరచిన వ్యవస్థగాని నిర్బంధించ లేవు గదా! సృష్టి వ్యవస్థ కతీతుడైన దైవము, సృష్టి విధానమున కంతరాయము కలుగకుండ, తనకు తానుగ దిగివచ్చి, ముందు తెలిపిన విధముగ కుండలినిని ప్రచోదనము గావించుచు జీవులకు ఏక కాలమున సర్వలోకానుభవములు కలిగించుట ప్రారంభించెను. దీనినే మాస్టరుగారు “ది న్యూ డైరెక్ట్ లైన్” అని సంబోధించిరి.

## 5. ఆది - ఆత్మ

మాస్టరుగారి యోగమున ఆది తత్త్వము, ఆత్మ తత్త్వము అను రెండు పదములు పదే పదే వాడబడినవి. వారి అవగాహన ననుసరించి ఆత్మ తత్త్వములో ప్రకృతి తత్త్వము యొక్క మాయా బీజ మున్నదనియు, అది కారణముగ ఆత్మ ఆదిని చేరు అవకాశము లేదనియు, ఆది తత్త్వమునకు దగ్గరగా నుండి ఒక రకమగు తృప్తిని పొందుటయేగాని, ఆదితత్త్వమును చేరలేకపోవుచున్న దనియు తెలియవలెను. ఆది తత్త్వమునకు, ఆత్మ తత్త్వమునకు నడుమ ఆదిశక్తి పనిచేయుచున్నదనియు ఆది తత్త్వమందు ఆదిశక్తి లయమైనపుడే ఆత్మ ఆదిని చేరగలదనియు కూడ తెలిపియున్నారు. మాస్టరు సి.వి.వి.గారు ప్రబోధించు మాస్టరు చైతన్యము ఆదితత్త్వము అని తెలియవలెను. 'మాస్టర్ నమస్కారమ్' అని పలికినపుడు ఆది నుండి తత్త్వము ఆదిశక్తి ద్వారా కుండలినిని స్పృశించగలదు. అనగా సృష్టి కాధారభూతమగు తత్త్వమే సూటిగ జీవులను ప్రచోదన మొనర్చుట ఈ యోగ మందలి విశేషము. ఆత్మ నుండి ఆత్మ వికాసము చెందుటగాక, ఆది నుండి ఆత్మ వికాసము చెందుట ఈ యోగమందలి నూతనత్వము.

# 6. కేంద్రపు మార్పు

సృష్టి కేంద్రస్థానమును ప్రకృతి నుండి 'ఆది' కి మార్చవలె నని, అపుడే సృష్టి పరిపూర్ణము కాగలదని మాస్టరుగారి ప్రబోధము.

ఆది నుండి వెలువడిన ఆదిశక్తి కాలము, ప్రకృతి ఆధారముగా త్రిగుణాత్మక సృష్టిని నిర్మాణము గావించుచున్నది. త్రిమూర్తులు ఆ శక్తినుండి ఉద్భవించినవారే. త్రిమూర్తులాధారముగ సప్తలోకముల నిర్మాణము, అందలి లోకపాలకులు, లోకులు ఆదిశక్తియే ఏర్పాటు గావించుచున్నది. సృష్టి యంతయు ఆదిశక్తి వ్యూహమే. త్రిమూర్తులు సైతము ఆమెకు లోబడి పనిచేయుదురు. ఆదిశక్తి వస్తుతః క్రియా స్వరూపిణి. ఆది తత్త్వము తదతీతమగు తత్త్వము. ఆత్మలు ఆది నుండి బయల్వెడలి నప్పటికిని ఆదిశక్తికి లోబడి యుండుటచే కేంద్ర మామెయై, ఆదిపురుషుడు మరుగున పడినాడు. ఆదిని చేరుటకు శక్తిని దాటవలెను. శక్తినుండి పుట్టినవారు ఆ శక్తిని దాటలేరు. కావున ఆదియే సంకల్పించి సృష్టికేంద్రమును, ప్రకృతి నుండి తనకు మార్చుకొనినదని, ఇపుడు ఆదియే కేంద్రముగా పనిచేయు చున్నదని, ప్రకృతి మార్గముల ద్వారమునకాక, జీవులు ఆదిని చేరవచ్చునని, ఆది సరాసరి జీవుల ననుగ్రహించునని,

దీనినే 'Shifting of the Centre' అని మాస్టరుగారు తెలిపిరి. మారిన కేంద్రము కారణముగ సత్య మవతరించి పరిపూర్ణ స్థితిని నెలకొల్పెనని, అది కారణముగ ఇది నూతన యోగమని మాస్టరు గారు తెలిపిరి.

## 7. అనంత ప్రాణము

సృష్టి పూర్ణత్వము పొందవలెనన్నచో సృష్టి ఆదిప్రకృతి లేక మూలప్రకృతి కేంద్రముగా గాక ఆదితత్త్వము లేక బ్రహ్మతత్త్వమే కేంద్రమై యుండవలెనని మాస్టరుగారి సంకల్పము. ఇచ్చట మాస్టరు గారు అనగా ఆదితత్త్వమే. ఆదితత్త్వమునుండే సంకల్పముగ సృష్టి దిగివచ్చినది. ఈ నూతన సంకల్పము (కేంద్రపు మార్పు) కూడ ఆది నుండియే ఉద్భవించినది. మూలప్రకృతి చేయు సృష్టియందుగల అపరిపూర్ణతలను తొలగించుటకు, సృష్టికి బలము చేకూర్చుటకు అటుపై పూర్ణత్వము సిద్ధింపచేయుటకు ఈ నూతన సంకల్పము ఆరంభమై, తనదైన ప్రాణమార్గమున ఆది నుండి భూమిని చేరినది. ఈ మార్గముననే వరుణ, వేన, అగస్త్య, శారమేయ, మఖ, అనూరాధ, ధనిష్ఠ, రోహిణి, సింహరాశి, వృశ్చికరాశి, కుంభరాశి, వృషభ రాశి... యిట్టి స్థావరములను గుర్తింపనగును. (వీని వివరములు మాస్టర్ పార్వతీకుమార్‌గారి యితర గ్రంథములలో గోచరించును.)

బ్రహ్మాండమంతయు స్పందనాత్మక స్థితిలో ఒక హంసవలె ఋషులు కీర్తించిరి. హంసగానము శ్వాస. శ్వాసయందు సంకోచ వ్యాకోచములు గలవు. ఈ హంస ఉచ్ఛ్వాసమే లోకాలోకములు వ్యక్త

మగుట. నిశ్వాసమే మరల వ్యక్తమైన లోకములు గుప్తమగుట. శ్వాస యందున్నదే ప్రాణము. ఈ ప్రాణమునకు మూలస్థానము ఆది తత్త్వమే. అచట నుండి బయలుదేరిన అనంతప్రాణము వివిధ లోకములందు, లోకస్థులయందు స్పందనాత్మక చైతన్యముగ పని చేయుచునే యున్నది. తత్కారణముగ లోకములు, జీవులు స్థితి యందున్నారు. ప్రాణము అనంతమైనను అది వసించు ఉపాధులు (రూపములు) ప్రాణమును నిలుపుకొనలేకపోవు చున్నవి. ప్రాణము నిలుపుకొనినచో మరణముండదు. ప్రాణము నిలుచుట కవరోధము రూపముల అపరిపూర్ణతయే. కావున మరమ్మత్తు చేయవలసినది రూపములకే. దేహమునకు మరమ్మత్తు గావించి, ప్రాణములను నిలిపి, యోగమున నిలబెడుతునని మాస్టరుగారు వాగ్దానము చేసి యున్నారు.

మాస్టరుగారి యోగమున ప్రథమముగ చికిత్సయంతయు దేహకోశములకే. ఈ చికిత్సవలన కోశములందు ప్రాణము స్థిరముగ నిలచును. ప్రాణము స్థిరముగ నిలచినచో యోగము స్థిరపడును. యోగమునకు గూడ ప్రాణమే సాధనము. కావున మాస్టరుగారు దేహములను సరిదిద్దుటకు ప్రాణమునే సాధనముగ వాడినారు. దేహముల చికిత్సకు, యోగమునకు కూడ ఔషధము ప్రాణమే అనునది మాస్టరుగారి వివరణ. అందువలన అనంత ప్రాణమును మరల పై తెలిపిన మార్గమున మాస్టరుగారు భూమికి కొనివచ్చిరి. ఆ మార్గమున మజిలీలే వేనుడను గంధర్వుడు, వరుణుడు అను

అశ్వినీదేవత, దత్తాత్రేయ మండలము (శారమేయ మండలము), అగస్త్య మహర్షి, తోకచుక్క హేలి, సింహరాశిలోని మఖ నక్షత్రము, వృశ్చికరాశిలోని అనూరాధ నక్షత్రము, కుంభరాశిలోని ధనిష్ఠ నక్షత్రము, వృషభ రాశిలోని రోహిణి నక్షత్రము మరియు గ్రహము లలో వరుణ గ్రహము. ఈ మార్గమున అనంత ప్రాణమును ప్రసారము చేయుట 1910 సంవత్సరము నుండి జరుగుచున్నది. మార్చి 31, 1910 సంవత్సరములో చంద్రుడు అనూరాధ నక్షత్ర ములో నుండగ భూమిపై అనంత ప్రాణమును స్థిరపరచుట జరిగినది. ఈ అనంత ప్రాణమును మాస్టరుగారి ప్రార్థనద్వారా పొందవచ్చును.

## 8. గుణాతీతము - నిర్గుణము - గుణాత్మకము

*(హయ్యర్ బ్రిడ్జ్)*

మాస్టరుగారు పరతత్త్వమును 'ఆది' అని సంబోధించేవారు. వేదములు ఆదిని పరబ్రహ్మముగను, పరతత్త్వముగను, నిరాకార తత్త్వముగను, అనిర్వచనీయమగు తత్త్వముగను తెలిపియున్నవి. ఏమీ లేనట్లున్నట్టి స్థితిగ తెలుపును. ఏమీ ఉన్నట్లనిపించని దాని నుండే సమస్తమును అవతరించుచున్నది గనుక అది నిజమున కేమియు లేని స్థితి కాదు. ఏమియు లేనట్లున్న స్థితి. ఈ లేనట్లు ఉండుట శాశ్వత స్థితిగను, అందుండి సృష్టి అవతరించినను కాల పరిమితిచే మరల లయమై, ఆదిగాను యుండును. కావున ఎప్పుడునూ ఉండునటు వంటిది.

ఇట్టి స్థితినుండి గుణాత్మకమగు సృష్టి ఏర్పడుటకు నడుమ గల స్థితిని మాస్టరుగారు నిర్గుణమనిరి. నిర్గుణమనగ గుణములు లేని స్థితి. గుణములింకను ఏర్పడని స్థితి. మాస్టరుగారి దృష్టిలో గుణాతీత తత్త్వము ఆది. అందుండి కాలము రూపమున సంకల్పము కలిగి మూలప్రకృతి శక్తి, మాయ ఉద్భవించి, అందుండి త్రిగుణాత్మ

కముగ ప్రకృతి అవతరించును గనుక, ఆదికిని త్రిగుణాత్మక ప్రకృతికిని నడుమనుండు రసాయన స్థితిని నిర్గుణమని సంబోధించిరి. అట్లు గుణాతీతము, నిర్గుణము, గుణాత్మకము అను మూడు స్థితులను మాస్టరు సి.వి.వి.గారు నిర్వచించిరి. అందు 'ఆది' గుణాతీతము. 'ప్రకృతి' గుణాత్మకము. ఈ రెంటికిని నడుమ గల స్థితిని నిర్గుణమని సంబోధించిరి. గుణాత్మకమగు ప్రకృతికి, గుణాతీతమగు ఆదికిని నడుమ నొక వంతెనను (కందకముపై వంతెనవలె) నిర్మాణము చేయుట ఒక ముఖ్య కార్యముగ, నూతన చైతన్యము నిర్వర్తించినదని మాస్టరుగారు తెలిపినారు. దానిని మాస్టరుగారు "హయ్యర్ బ్రిడ్జ్" అని సంబోధించినారు. ఈ హయ్యర్ బ్రిడ్జ్ ఏమీలేనట్లున్న స్థితి నుండి అన్నీ ఉన్నట్టి మూలప్రకృతి స్థితివరకు ఏర్పరచబడిన దారి. ఈ దారి తెలిసినవారికి సృష్టి నిర్మాణ రహస్యము తెలియును. జనన మరణముల రహస్యము తెలియును. మాస్టరుగారి యోగమున ఈ వంతెన కత్యంత ప్రాధాన్యమున్నది. ఈ వంతెనను మాస్టరుగారు పది నూతన పదములతో వర్ణించినారు.

## 9. నూతన పదములు

మాస్టరుగారు యోగము నందించుచు కొన్ని నూతన పదములను కూడా అందించినారు. వారి యోగమును గూర్చిన గ్రంథములను అవగాహన చేసుకొనవలెనన్నచో ఈ నూతన పదముల అవగాహన అవసరము. మాస్టరుగారి యోగ విధానమును వివరించు ఈ వినయ పూర్వక ప్రయత్నమున పలుచోట్ల ఈ పదముల వివరణ జరుగుచు నుండును. కొన్ని పదములను మాత్రము యిచ్చట తెలియపరచు చున్నాము.

### 1. హిడెన్స్ :

'హిడెన్స్' అనగా దాగి యున్నది, గుప్తము అని అర్థము. ఆదితత్త్వ మట్లు దాగియున్నది. ప్రళయస్థితిలో అది అత్యంత శీతలత్వము కలిగియుండును. దానియందే సర్వ పూర్ణ తత్త్వములు గుప్తముగా నుండును. మూలప్రకృతి, కాలము, సృష్టించు అభిలాష, సృష్టిజ్ఞానము, అజ్ఞానము, సనక సనందనాది కుమారులు, సప్త ఋషులు, మనువులు, యితర జీవులు కూడ అందే యిమిడి యుండుటచే ఆది తెలియబడదు. తెలుసుకొనుటకింకొక ప్రజ్ఞ లేనపుడు ఏమి తెలియబడగలదు? ఆది అనిర్వచనీయ మనియు,

అప్రతర్క్య మనియు, అవిజ్ఞేయ మనియు, అలక్షణ మనియు, నిరాకార మనియు, అనామ మనియు, అనాథ మనియు, అగాధ మనియు ఋషులు కీర్తించిరి. దీనిని మాస్టరు సి.వి.వి. గారు 'హిడెన్స్' అనిరి.

## 2. హింట్ :

హిడెన్స్ నుండి ఏర్పడిన సంకల్పమునే మాస్టరు సి.వి.వి. గారు 'హింట్' అని పలికిరి. 'హిడెన్స్'ని పీనియల్ గ్రంథిగా గుర్తించినచో, 'హింట్' పిట్యూటరీ గ్రంథిగా గుర్తించవలెను. హింట్ కారణముగ కేంద్రము లేని హిడెన్స్‌కు కేంద్ర మేర్పడును. ఆది తత్త్వమునకు కేంద్రము లేదు. అందుండి పుట్టిన సంకల్పము నకు కేంద్రముండును. సంకల్పమే కేంద్రమగును. సంకల్ప మందలి బలము అగ్ని. అగ్ని కారణముగ బిందువుగా ప్రారంభ మైన సంకల్పము ఒక అండముగ నిలచును. అట్లు మొత్త మాకాశము నుండి కొంత ఆకాశము అండముగ ప్రత్యేకముగ నిలచును. అండము వెలుపల ఆకాశము, వెలుపల ఆకాశముగ ఉండును. సంకల్పము కారణముగ లోపలి ఆకాశము సంకోచ వ్యాకోచములు చెందుచుండును. (Impulse is the basis for the pulse.) అదియే శ్వాస. అదియే హంస. ఆకాశము అనగా ఆంగ్లమున 'ఈథర్' అనియు, 'స్పేస్' అనియు అందురు. పురాణము లందు దీనిని జలములని గూడ అందురు. మాస్టరుగారు

ఆకాశమును 'స్పేస్' అనియు, అందలి స్పందనాత్మకమగు హంసను 'శ్వాన్' అనియు సంబోధించి స్పేస్, శ్వాన్లకు హింట్ కేంద్ర మనియు, హింట్ కు హిడెన్స్ మూలమనియు తెలిపిరి.

## 3. గుప్త బహిస్తస్థ్య :

హిడెన్స్ నుండి హింట్ ఏర్పడుట అనగా గుప్తము బహిర్గత మగుటయే గదా! ఆది గుప్తము కాగ, అందుండి వచ్చు సంకల్పము ఆది యందిమిడియున్న వాటిని బహిర్గతము చేయును. అది కాలము ననుసరించి జరుగునని పురాణములు తెలుపుచున్నవి. కాలము ననుసరించి సంకల్ప ముద్భవించుట జరుగగా, ఈ జరుగుటను 'గుప్త బహిస్తస్థ్య' అని మాస్టరుగారు సంబోధించిరి.

## 4. ఇకల్ట్ :

'ఇకల్ట్' అనగా పరమ శీతల స్థితి. దీనిని కూల్ అని కూడ మాస్టరుగారు అనిరి. ఆదితత్త్వ మీ స్థితిలో నుండును. సమాధి స్థితి యందు యోగి అనుభవించునది గూడ యిదియే. అన్నీ యిమిడి యున్న స్థితి యిది. ఇది నారాయణుని కపట నిద్రవంటిది. పరమ శివుని ధ్యానము వంటిది.

## 5. అకల్ట్ :

మాస్టరుగారి పరిభాషలో 'అకల్ట్' అనగా మొదటి సంకల్పము లేక హింట్ యొక్క వేడిమి. ఈ వేడిమిని వేదములలో అగ్ని

యందురు. అగ్నియే దైవముగ వేదములు ఘోషించుచున్నవి. సమస్త సృష్టికిని ఈ అగ్నియే కారణము. ఈ అగ్ని కారణముగనే శీతలము, ఘనము అయిన స్థితి నుండి ద్రవీకరణము జరిగి సృష్టి అంశములు వెలువడును.

## 6. గేస్ ఎయిర్ :

హిడెన్స్ (ఆది) హింట్‌గా మారి మూడవ స్థితిలో గేస్ ఎయిర్‌గా నిలబడునని మాస్టరుగారు పలికిరి. అనగా సంకల్పమునుండి బహిర్గతమైన అగ్ని చోటులో సంకోచ వ్యాకోచముల నేర్పరచుట. ఘనీభవించిన హిడెన్స్ నుండి పుట్టిన హింట్‌లో నుండి పుట్టిన అగ్ని వలన ఏర్పడిన వ్యాకోచమే 'గేస్ ఎయిర్'.

## 7. శ్వాన్ :

గేస్ ఎయిర్ నుండి నాల్గవస్థితిలో స్పందనము జనించును. వాయువే స్పందనమున కాధారము. ఈ స్పందనమును హంస అని పురాణములు తెలుపుచున్నవి. మాస్టరుగారు దానిని 'శ్వాన్' అనిరి.

## 8. స్పిరిట్ :

స్పందనాత్మకమగు చైతన్యము అనంత వాయువును ఖండిక లుగ, త్రుంపులుగ ఒక పరిమిత విస్తీర్ణతను కలిగించుచున్నది. ఒక స్పందనమునకు ఒక కాలపరిమితి కలదు. అనంతవాయువున కది

లేదు. స్పందనమును ఖండికలు చేయగ, ప్రతి ఖండికయందు ఆది, దాని లక్షణములైన అగ్ని, వాయువు, ప్రకృతి ఖండిక లగు చున్నవి. ఇట్లు అపరిమితత్త్వము నుండి పరిమిత విస్తీర్ణము గల వాయువు, అగ్ని, ఆకాశము ఏర్పడుటను మాస్టరుగారు 'స్పిరిట్' అని సంబోధించిరి.

## 9. బిందు :

పై తెలిపిన స్పిరిట్ సంకోచము చెంది, అనగా ఘనీభవించి ఒక 'బిందు' వగుచున్నది. ఈ బిందువు మరింత ఘనీభవించి అణువగుచున్నది.

## 10. ఏటమ్ :

పై తెలిపిన బిందువు బ్రద్దలై పరమాణువు లగుచున్నవి. ఈ పరమాణువులే ఇంకనూ సూక్ష్మములై జీవులగు చున్నవి..

ఇట్లు మాస్టరుగారు పది నూతన పదములు వివరించుచు ఆది తత్త్వము పది దశలలో ఎట్లు సృష్టి నిర్మాణము చేయుచున్నదో (జరుగుచున్నదో) అత్యంత క్లుప్తముగ తెలిపినారు. వేదములు '*అత్యతిష్ఠ దశాంగులమ్*' అని పలుకు విషయమై మాస్టరుగారు నూతన పదములతో (ఆంగ్ల పదములతో) నిర్వచించినారు. ఆంగ్లము భౌగోళిక భాష యగునని తెలిసిన పరమగురువుల పరంపరలో ముఖ్యులగు మాస్టరుగారు ఆంగ్ల పదములలో నూతనముగ సృష్టిక్రమమును, యోగమును తెలుపుట ఒక విలాసము.

## 10. భృక్తము - రహితము - తారకము

పరతత్త్వమునుండి కాలము ననుసరించి ప్రేరణ కలుగును. ప్రేరణ కలుగగనే తత్త్వమునకు చోటునందు వ్యాప్తి కలుగును. తత్త్వమే ప్రేరణతో కలిసి వ్యాప్తి చెందును. వ్యాప్తికి క్రమముగ దిశానిర్దేశము ఏర్పడును. గతి ఏర్పడును. ఆ మార్గమున ప్రవహించు చున్న తత్త్వము ప్రకృతి గుణములచే యింకను బంధింపబడనిది గనుక తుష్టిగ, పుష్టిగ, పూర్ణ ఆరోగ్యముగ ప్రవహించుచుండును. ఈ ప్రవాహ పూర్ణ స్థితిని మాస్టరుగారు 'భృక్త' అనిరి. దీనినే 'M.T.A.' అని కూడ అందురు. ఈ స్థితినే 'ప్రవేశాత్మ' అని కూడ అనిరి. ఈ స్థితియందున్న తత్త్వము పరిమితములను రహితము చేయగలదు. పరిమితుల నుండి తరింప చేయగలదు. అనగ M.T.A. భృక్తము, రహితము, తారకము అను శక్తులతో కూడిన ప్రవేశాత్మ. అది పరమాత్మయే, అవతరణ ప్రారంభమున ప్రవేశాత్మ అయినది. M.T.A.ను ప్రార్థించునపుడు ఈ ప్రవేశాత్మ తత్త్వము మనయందలి అంతరాత్మను చేరి, జీవాత్మను స్పృశించును. తత్కారణముగ జీవాత్మ తత్త్వము ప్రచోదనము చెంది, భృక్త–రహిత –తారక స్థితులను చేరును.

ఇచ్చుట మాస్టరుగారు వాడిన పదము లిట్లున్నవి :

*1. ప్రవేశ :* కాలము కారణముగ ప్రేరణ కలిగినపుడు నిద్రాణమైన తత్త్వము చోటులో మేల్కొనుట.

*2. వ్యాపక :* మేల్కొనిన తత్త్వము వ్యాపనము చెందుట.

*3. గతి :* వ్యాపనము చెందుతున్న తత్త్వము కాలగతి ననుసరించుట.

*4. కిరణము :* ఒకే గతిన ప్రవహించుచున్న తత్త్వము శక్తివంతమగుట.

*5. ఆరోగ్య :* ప్రవాహగతి పుష్టి, తుష్టి, శక్తి, పరిపూర్ణతలతో నుండుట.

*6. భృక్త :* ఐదవ స్థితిలోని తత్త్వము (త్రిగుణాత్మక సృష్టిలోనికి) అవతరణమునకు సిద్ధమగుట. దీనినే మాస్టరుగారు నూతన చైతన్య మనిరి.

*7. రహితము :* భృక్తము పరిమితులను (త్రిగుణాత్మక పరిమితులు) సరిదిద్ది రహితము చేయుట.

ఇట్లేడు స్థితులలో గుణాతీతమగు తత్త్వము గుణాత్మకమగు తత్త్వములో ప్రవేశించి జీవులను సరిదిద్దుట జరుగునని మాస్టరు గారి వ్యాఖ్యానము.

# 11. M.T.A. - A.T.M

ఆది, నిర్గుణత్వము, గుణాత్మకము అను విషయములు తెలుపబడినవి. ఆది నుండి గుణాత్మకము వరకు వ్యాపించియున్న నిర్గుణ స్థితులు తెలుపబడినవి. గుణాత్మక సృష్టిలోని ఏదైనను గుణములను దాటి నిర్గుణమును చేరలేదు. అందువలననే బ్రహ్మ తత్త్వము జీవుల కందుబాటులోనికి వచ్చుట లేదు. కావున బ్రహ్మమే నిర్గుణమనెడి చోటులోనుండి తానుగ సృష్టిలోనికి నొక నూతన మార్గమును ఏర్పరచుకొని దిగివచ్చుట మాస్టరుగారందించిన నూతన యోగ వివరము. దానిని (ఆ మార్గమును) మాస్టరుగారు M.T.A. అనిరి. Empty నుండి దిగివచ్చినది గదా! అందుచే దానిని M.T.A. అనిరి.

మానవుడు అణువుతో పోల్చదగినవాడు. అణువును ఆదిగ మార్చుటయే మాస్టరుగారి యోగము. పిండాండము తనయందలి బ్రహ్మాండమును దర్శించుటయే ఋషులు చెప్పిన మార్గముకూడ. "అహం బ్రహ్మాస్మి" అను అనుభూతి ఋషులిచ్చిన సందేశమే. కాని బ్రహ్మమైన వారు తక్కువ. పిండాండము బ్రహ్మాండమగుట, అణువు ఆది యగుటను మాస్టరుగారు A.T.M. అనిరి. A.T.M. అనగా

Atom Turned Master. దీనిని నిర్వర్తించునది M.T.A. అనగా దిగివచ్చిన ఆదితత్త్వము. ఆదితత్త్వము దిగివచ్చి, అణురూపములైన జీవులను తనలోనికి ఉద్ధరించుకొనుటయే నూతన యోగమని మాస్టరుగారి ఉద్ఘోష.

తప్పిపోయిన పసివాడు తన తండ్రిని వెతకుకొనగలడా? అని మాస్టరుగారి ప్రశ్న. తండ్రియే వెతకుకొనుట సులభము. అదియే పరిష్కారము. మాస్టరుగారందించు యోగమున ప్రార్థన చేయు సాధకుని లోనికి M.T.A. దిగివచ్చి, సాధకుని సరిదిద్దుకొని బ్రహ్మస్థితికి చేర్చును. బ్రహ్మము నుండి సాధకుని వరకు M.T.A. మార్గ మేర్పరచుకొని సాధకుని చేరి ఉద్ధరించగలదు. కావున ప్రార్థనయే ఈ యోగ మార్గమున అత్యంత ప్రాధాన్యము కలిగి యున్నదని మాస్టరుగారు తెలుపుతు నుండెడివారు. బ్రహ్మము నెరుగుటకు ప్రార్థన యొక్కటి చాలునని, యితరములు ఊసుపోక చేసుకొనవచ్చునని వేదముల సారమెరిగిన మాస్టరుగారు సూత్రీకరించినారు.

## 12. విశిష్ట ప్రయోగము

ప్రతి మానవునకును అతని పరిణామమును బట్టి అతని స్వభావము వర్తించుచుండును. స్వభావము జీవునకు ఛాయవంటిది. జీవుడు చైతన్య స్వరూపుడు. స్వభావము అతనికి ఉపాధి. స్వభావ మాధారముగ అతడు ప్రపంచముతో సంబంధ బాంధవ్యముల నేర్పరచుకొనును. స్వభావము ద్వారానే తాను పొందవలసిన అనుభూతిని పొందును. అనుభూతి నుండి అవగాహన కలుగును. అనుభూతి అపరిపూర్ణత తగ్గుచున్నకొలది జీవుని అవగాహనలో అపరిపూర్ణత తగ్గును.

ప్రతి మానవుడు మరణించు సమయమున అతడు ముందు యాతనా శరీరమున ప్రవేశించును. యాతనా శరీరమునుండి లింగ శరీరమును పొందును. ఈ లింగ శరీరము తాను, తన స్వభావముల నమూనా. మఱ్ఱి విత్తనములో మఱ్ఱిచెట్టు నమూనా ఎట్లుండునో, లింగశరీరమందు ఆ మానవుని నమూనా అట్లుండును. మఱ్ఱిగింజ భూమిలో నాటినపుడు, పంచభూతము లాధారముగ ఆ నమూనా విచ్చుకొనును. అట్లే జీవుడు మరల గర్భమున ప్రవేశించి, పంచ భూతాత్మకమగు శరీరము నిర్మాణమగుసరికి

అందు తనదైన నమూనా విచ్చుకొనును. అంతకుముందు పొందిన అనుభవము, అవగాహన అతని సామర్థ్యముగ నుండును. ఇంకను పొంద వలసిన అనుభవము, అవగాహన బలహీనతగ నుండును. ఈ మొత్తము చిత్రము అతని యందు గుప్తముగ నుండి, కాలము ననుసరించి జీవనమున వ్యక్త మగుచుండును. ఇట్లు గుప్తముగ పొందుపరచిన జీవుని స్వభావ చిత్రమే 'చిత్రగుప్తుడు' అని మాస్టరు గారి నిర్వచనము.

మాస్టరుగారు తనదైన రీతిలో ఈ చిత్రగుప్తుడు పనిచేయక అరికట్టబడు ఉపాయము నొకటి ఆలోచించినారు. చిత్రగుప్తుని బందీగా జీవుడు జీవించుటగాక, చిత్రగుప్తుడినే బందీ చేసినచో జీవుడు స్వతంత్రుడై జన్మ మెత్తవచ్చును కదా! అట్లు చేయుటకు మాస్టరుగారొక వ్యూహమును ఏర్పాటు గావించినారు. జీవుడు భౌతికశరీరము వదలు సమయమున యాతనా శరీరమున ప్రవేశించును. యాతనాశరీరము జీర్ణించిననే లింగశరీర మేర్పడును. లింగస్వరూపము జీవుని పూర్వ వృత్తాంతమంతయు నిక్షిప్తము చేయును. అందువలన జీవుని యాతనా శరీరముననే స్థిరపరచి, ఆ శరీరమును బలపరచి, అందున్న జీవికి జ్ఞాన బోధనము గావించినచో, అతడు అటుపై లింగ శరీరమున చేరినప్పటికి, జ్ఞాన బలమున స్వభావమును త్వరితగతిని అధిగమించ గలడు. జీవప్రజ్ఞ స్థూల శరీరము నందున్నప్పటి కన్న, సూక్ష్మ శరీర మందున్నప్పుడు, జ్ఞానము విశేషముగ ఆకళింపు కాగలదు.

సర్వయోగ సాధన విజ్ఞానమయకోశమగు సూక్ష్మకోశముననే సాధ్య మగును గాన, స్థూలమునుండి సూక్ష్మమును వేరుచేసి, సూక్ష్మమును జ్ఞానపరముగ బలపరచుట ప్రధానమని మాస్టరుగారి భావన. అందులకే ప్రార్థనా సమయము, నిద్రా సమయము యోగసాధనకు అత్యంత విలువగు సమయములుగ మాస్టరుగారు ప్రస్తావించు చుండెడివారు. నిద్ర కుపక్రమించునపుడు కూడ ప్రార్థన గావింపు డని అందులకే తెలిపినారు.

యాతనా శరీరములో నుండగనే అతనికి పిండాండ బ్రహ్మాండ జ్ఞానము నందించినచో తదనుగుణమైన జ్ఞానముతో అతడు మరల భౌతికలోకమున వలసిన పరిపూర్ణతను త్వరితగతిని పొందగలడని మాస్టరుగారి భావన.

పై నుదహరించిన ప్రయోగము మాస్టరుగారు తనకు పుట్టిన 'చందు' అను బిడ్డ విషయమున, తన భార్య వెంకమ్మగారి విషయ మున, తన శిష్యుడు సుందరం విషయమున నిర్వర్తించి కృత కృత్యులైరి. ఇది ఒక మహత్తర ప్రయోగము.

మానవుని యాతనా శరీరమును 'ఈథరిక్' స్వరూపమని మాస్టరుగారు నిర్వచించిరి. ఈ ఈథరిక్ స్వరూపము ఘనీభవించి ఒక స్ఫుటాకారము కలిగి రాబోవు నూతన శరీరమునకు మూసగా పనిచేయును. ఈథరిక్ శరీరము ఘనీభవించిన మానవుని యందు చిత్రగుప్తుడు అరికట్టబడి, ఈథరిక్ శరీరముతోనే భౌతికము లోనికి

వచ్చును. స్వతంత్రుడై దిగివచ్చును. ఈ ప్రయోగము మాస్టరు గారి యోగమున ఒక నమ్మశక్యము కాని విషయము. సంప్రదాయము దీనిని అంగీకరించదు. కాని మాస్టరుగారు బ్రహ్మమే సంకల్పించి నూతన మార్గము నేర్పరచినపుడు దానికెవరి అనుమతి కావలెను? క్రమముగ గ్రహదేవతలే నూతన విధానమునకు సహకరించ వలసి యుండును గాని, బ్రహ్మము సంకల్పమునకు తిరుగు లేదు కదా! దేవతలు కూడ బ్రహ్మము సంకల్పమునకు సహచరులే గాని, వ్యతిరేకులు కానేరరు కదా!

పై విధమగు ప్రయోగము మొదట 'చందు' అను వెంకమ్మ గారి ప్రథమ సంతానము గర్భములో నుండగనే చందు జీవప్రజ్ఞ ఆధారముగ నిర్వర్తించిరి. అట్లే వెంకమ్మగారి శరీరమునుండి ఈథరిక్ వేరుచేసి, ఆ శరీరముతో ఆమెకు లోకాలోక గమనము నకు ఏర్పాటు చేసి అనేకానేక విషయములను గమనించిరి. ఈ ప్రయోగము లన్నియు ముందు అధ్యాయములలో వివరముగ తెలుపబడును.

# 13. నూతన శరీర నిర్మాణము

మాస్టరుగారి అవగాహనలో మానవుల శరీర నిర్మాణమున సుషుమ్న నిర్మాణము సరిగ జరుగలేదని తెలిపియున్నారు. మానవ శరీర నిర్మాణ కథ యుగముల కథ. ఈ భూమిపై పరిణామమునకై కొనిరాబడిన మానవులు మూడవ దశలో బుద్ధి, మనస్సు పొందిరి. నాల్గవ దశలో కామము, ధర్మకామము పొందిరి. ఐదవ దశ కథయే ఆర్యజాతి కథ. ఈ ఆర్యులే ముందు దశలో అట్లాంటియన్లు. అట్లాంటియన్లే అంతకు ముందు దశలో లెమూరియన్లు. లెమూరియన్లే ముందు దశలో హైపర్ బోరియన్లు. అంతకు ముందు దశలో శ్వేతద్వీపవాసులు. ఈ ఐదుదశలు భూమి నిర్మాణ పరిణామ కథ, జీవుల శరీర నిర్మాణ కథగా గుప్తవిద్య సూచించు చున్నది. ఈ ఐదు దశలలో జీవులు వరుసగా సత్యమును, చైతన్యమును, బుద్ధిని, ధర్మాధర్మ కామమును, దాని ఘర్షణమును అనుభూతము చెందిరి. ఆర్యజాతి మనస్సు ప్రధానముగ, కామమును జయించి ధర్మమున స్థిరపడుట వైవస్వతమనువు నిర్దేశించిన గమ్యము.

మనువు నిర్దేశము నిర్వర్తింపబడవలె నన్నచో శరీర నిర్మాణ

మున మార్పులు జరుగవలెను. ఆ మార్పులు చేయుటకే ఆది బ్రహ్మము M.T.A. ద్వారా భూమిని చేరినదని మాస్టరుగారి అవగాహన. నూతన చైతన్యము మానవ సహస్రారమును చేరి, అటనుండి దిగువకు సుషుమ్నద్వారా ప్రసారము కావలెను. ప్రస్తుత మట్లు జరుగుట లేదు. దానిని నిర్వర్తింపజేయుటకై మాస్టరుగారు మనువుతోను, మరువు మహర్షితోను ఒక ఒప్పందము గావించు కొనిరి. దాని నాధారముగ నూతన శరీర నిర్మాణ కార్యక్రమములు 1910వ సంవత్సరము నుండి ప్రారంభమైనవి.

## 14. ప్రార్థన - కోర్సులు - సర్దుబాట్లు

ఆజ్ఞ నుండి సహస్రారమునకు మార్గ మేర్పరచినచో సహస్రారమును చేరు M.T.A. ఆజ్ఞను ప్రవేశించి, సుషుమ్న మార్గమున మూలాధారము వరకు చేరగలదు. అపుడు కుండలిని ప్రచోదనము పొంది, ఊర్ధ్వముఖముగ ఆకర్షింపబడగలదు. మాస్టరు గారి ప్రార్థన ద్వారా ఇది సాధ్యపడును. అందులకే ప్రార్థనకు ప్రాముఖ్యత. ప్రార్థన శ్రద్ధాభక్తులతో నిత్యము నిర్వర్తించుకొనని వారికి ఈ యోగమార్గమున ఏమియును దక్కదు. కావున మాస్టరు గారే పదేపదే ఉభయ సంధ్యలయందు పది సంవత్సరములపాటు ప్రార్థన గావించుట ముఖ్యమని తెలిపిరి.

మాస్టరుగారి అవగాహన మేరకు మానవ శరీరములో 12 వేల కేంద్రములు కలవు. ఈ కేంద్రము లన్నింటిని సరిదిద్ది, ప్రచోదనము గావించి, అనుసంధానము గావించవలసి యున్నది. దీని నుద్దేశించియే మాస్టరుగారు ఎడ్జస్ట్‌మెంట్ కోర్సుల నిచ్చినారు. ప్రత్యక్షముగా ఈ కోర్సులను తాను నిర్వర్తించినారు. అటుపైన ఈ కోర్సులను నిర్వర్తించుటకు సమర్థులుండరని తెలిసి “ప్రార్థనయే సర్వప్రయోజనములను గావించునని” తెలిపినారు.

(మాస్టరుగారి తదనంతరము మాస్టర్ యమ్.యన్. మాత్రమే ఈ కోర్సులను నిర్వర్తింపగలిగినారు. ప్రస్తుతము ప్రార్థన యొక్కటియే సర్వశ్రేయస్కరము.)


ప్రార్థన ద్వారా మాస్టరుగారు మానవ శరీరమందలి కేంద్రము లన్నిటిని క్రమముగ ప్రచోదనము గావింతునని తెలిపినారు. దానివలన యోగము స్థిరపడునని కూడ తెలిపినారు. యోగమార్గమే దివ్యమునకు మార్గము. ప్రజ్ఞలకు చేసిన ఎడ్జస్ట్ మెంట్స్ కారణముగ, ప్రజ్ఞ అవరోధము లేకుండ ఊర్ధ్వముగ పయనించి, ఆజ్ఞను చేరి, అచ్చుట నుండి హయ్యర్ బ్రిడ్జ్ మీదుగ సహస్రారము చేరునని తెలిపినారు. తానే సహస్రారము నధిష్ఠించి, జీవ ప్రజ్ఞయందు సర్దుబాట్లు గావించి, ప్రచోదనము కూడ గావించి తనవద్దకు పిలుచుకొందునని తెలిపినారు. అదియే "మాస్టర్ కాల్". శ్రద్ధాభక్తులతో ప్రార్థన చేయు ఏ సాధకునైనను తానుగా పిలుతునని, తనంత వారిగ చేతునని తెలిపినారు. మాస్టరుగారి పిలుపు ఎవరికైనా దక్కవచ్చును. ఎప్పుడైనా దక్క వచ్చును. వారి పిలుపు ఏ క్షణములోనైన జరుగవచ్చును. అప్రమత్తతతో ప్రార్థనను నియమ సహితముగ పాటించుటయే కర్తవ్యము. మాస్టరుగారు పిలుతురేమో అను ఉత్సుకతతో ప్రతినిత్యము ప్రార్థన చేయవలెను.

## 15. ప్రార్థన - ప్రాణము

యోగమున స్థిరపడవలెనన్నచో ప్రాణము కూడ స్థిరపడవలెను. మాస్టరుగారు మానవ దేహమందలి ప్రాణమునుగూర్చి పరిశీలించి యిట్లనినారు. ప్రస్తుతము మానవ దేహములో 64 కేంద్రములలో ప్రాణము సరిగ పనిచేయక ఘర్షణ కలిగించు చున్నది. లోప మేర్పడి శరీరమునకు రోగము కలుగుచున్నది. రోగము లరి కట్టనిచో శరీరము యోగార్హత పోగొట్టుకొనును. యోగసాధన చేయువానికి శరీర మత్యావశ్యకము. శరీరము పదనుగ నుండు టకు ప్రాణ ప్రవాహమున ఘర్షణ లుండరాదు. అందులకై మాస్టరు గారు శ్వాసను నిర్దేశించు కొన్ని ప్రక్రియలను జరిపినారు. ఇవియును ప్రార్థన రూపమున జరుగగలవని తెలిపినారు. కొందరు సాధకులకు ప్రార్థనా సమయమున శ్వాసలో మార్పులు జరుగుట, ఆవశ్యకతను బట్టి జరుగుచునే యుండుట యుండును. అట్లు జరిగినపుడు ప్రాణము సరిదిద్దబడు చున్నదని తెలియవలెను. ప్రాణము నిస్సారముగ నున్నపుడు "మాస్టర్ ప్రాణా ట్రీట్" అని ఉచ్చరించి, ప్రార్థనను కొనసాగించవలసినదిగ కూడ హెచ్చరించి నారు.

## 16. బ్రహ్మమే గురువు

జీవుడు త్రిగుణములచే నడిపింపబడుచున్నాడు. త్రిగుణములు ప్రకృతిచే నిర్వర్తింపబడుచున్నవి. ప్రకృతి కాలము వలన ప్రేరణ చెందుచున్నది. కావున జీవుడు గుణబద్ధుడు, ప్రకృతిబద్ధుడు, కాల బద్ధుడు అయి ఉన్నాడు. కాలము, ప్రకృతి దైవమునుండి దిగి వచ్చినవే. జీవుడు కూడ దైవమునుండి దిగివచ్చినవాడే. ప్రకృతి, కాలములవలె దైవబద్ధుడు కాక, వేరగు త్రిభుజముచే బంధింపబడి యున్నాడు. అతనిని విడిపించుటకు బ్రహ్మమే సరాసరి దిగివచ్చుట మాస్టరుగారు చెప్పిన న్యూ డైరెక్ట్ లైన్ (New Direct Line). అందుచేత మాస్టర్ చైతన్యము సరాసరి బ్రహ్మమునుండి సహస్రారము ద్వారా దిగివచ్చి సహస్రారమునకు, ఆజ్ఞకు మధ్యగల కందకముపై వంతెనను నిర్మించుకొని, సుషుమ్న ద్వారా మూలా ధారము చేరి జీవప్రజ్ఞను తోడ్కొని మరల సహస్రారము చేరుట మాస్టరుగారందించిన ప్రేయరు ప్రయోజనము. దీనిని భావన చేయుచు ప్రార్థన చేసినచో ప్రార్థన త్వరితముగ ఫలించును. ఈ యోగమున బ్రహ్మమే గురువు. దీనిని ఈ విధముగ చిత్రీకరించ వచ్చును.


బ్రహ్మము
కాలము
New Direct Line
ప్రకృతి
త్రిగుణము
జీవుడు

## 17. యోగము - తెగువ

మానవుని మనస్సు ఆకసము నుండి మేము (పరమగురువు) గమనించునపుడు చాల గజిబిజి గోచరించును. మానవుడీ భూమిపై పుట్టి కోటీ ఎనభై లక్షల సంవత్సరములు దాటినదని గుప్తవిద్య సూచించును. ఈ కాలపరిధిలో లక్షల జన్మలు మానవుడెత్తినాడు. జన్మజన్మకు రకరకములైన అనుభూతులు, అనుభవములు, అవగాహనలు ఏర్పడినవి. రకరకముల సిద్ధాంతములు అనుభవించి నాడు. ప్రస్తుతము అతని మనసునిండా అనేకానేక నమ్మకములు, విశ్వాసములు, సిద్ధాంతములు గూడుకట్టుకొని యున్నవి. వీనిచే అతని మనస్సు బంధింపబడి యున్నది. నూతనమైన ఏ విషయము నందించినను దానిని తన సిద్ధాంతముల నుండి, తన విశ్వాస ముల నుండి, తన నమ్మకములో నుండి చూచును. అందుచేత నూతనము నూతనముగ నిలువక అదియును గజిబిజిని చేరును. పాత్ర శుభ్రముగ నున్నచో అందు వండిన పదార్థము నిర్దేశింప బడిన రుచి నిచ్చును. ఇప్పటికే కడుగక పది వివిధమగు వంటక ములు చేసిన పాత్రలో మరియొక వంటకము చేసినచో, నిర్దేశింప బడిన రుచి రాదు. ఉన్న పాత్రను శుభ్రముగ కడిగి, క్రొత్త వంటకమును చేయుట సరియగు పని.

సెల్‌ఫోన్‌లో ఉన్న చిప్‌ను మార్చి, క్రొత్త చిప్ వేసినచో ఎట్లు పనిచేయునో అట్లే మనసులోని గజిబిజిని తీసివేసి నూతనత్వమును ప్రవేశపెట్టవలెను. అట్లు కానిచో ప్రయత్నమంతయు వృథా యగును.

పై కారణముగనే ఈ ప్రార్థన చేయువారు ప్రస్తుతము వారు మునిగియున్న సంప్రదాయములు, సిద్ధాంతములు, సాధనలు విడిచిపెట్టినచో ఈ యోగము త్వరితగతిని ఫలించునని తెలిపినారు. ఇట్లు చేయుటకు తెగువ కావలయును.

## 18. సృష్టి - అపరిపూర్ణత

మానవునకు పూర్ణత్వము వచ్చుటకు వలసిన లక్షణములు, పవిత్ర ప్రేమ, మరపులేని ప్రజ్ఞ, ప్రాణపుష్టి ఘనీభవించి స్ఫుటాకారము కలిగిన సూక్ష్మ స్వరూపము. అపుడే అతడు పూర్ణమగు ఆనంద మును పొందగలడు. బ్రహ్మము నందే యిట్టి పూర్ణత్వమున్నది. ప్రకృతి యందట్టి పూర్ణత్వము లేదు. కావున ప్రకృతిబద్ధులైన జీవులకు ఇది లభించుట అరుదు.

త్రిగుణములనుండి ధృవమండలము చేరి, ధృవ మండలము నుండి సప్తర్షి మండలముచేరి, అచ్చటనుండి నక్షత్ర మండలము చేరి, ఆ తరువాత గ్రహమండలము చేరి, ఆ పై సూర్యమండలము చేరి, చంద్రమండలము మీదుగా భూమండలమున శరీరము దాల్చు జీవులకు పరిపూర్ణత స్థిరపడవలె నన్నచో ఈ మొత్తము దారి యంతయు పరిపూర్ణత్వముతో నిండియుండవలెను. ఇందు అన్ని మండలములలోని ప్రజ్ఞలు పరిణామము చెందుచునే యున్నవి. పూర్ణ పరిణామము చెందని మండలములద్వారా, పూర్ణ ప్రజ్ఞతో కూడి యుండిన జీవులెట్లు దిగిరాగలరు?

మూసలోనే వంకరలున్నపుడు మూసనుండి వచ్చు బొమ్మ వంకరలేక యుండునా? భూమండలము, చంద్రమండలము, సూర్య మండలము, గ్రహమండలము కూడ పరిపూర్ణతను సాధించుటకై సాగుచున్నవి. వాటిద్వారా ఏర్పడిన జీవులకు పరిపూర్ణత అసాధ్యము. అందులకే బ్రహ్మమే సంకల్పించి సూటిగ జీవుల నుద్ధరించుకొనుట అను సూత్రము ప్రధానముగ ఈ యోగ మేర్పడినదని మాస్టరుగారి వివరణ.

## 19. ప్రార్థన - మగత

సాధన అనగా మాస్టరుగారు ఒక నిర్వచనమిచ్చిరి. పరిమిత జ్ఞాన పరిధిలోనికి, అపరిమితమైన శుద్ధప్రజ్ఞ వచ్చుటకు దారిని తయారుచేయటమే సాధన. సాధన జరుగుచున్నప్పుడు శుద్ధప్రజ్ఞ పరిమితమగు ప్రత్యేక ప్రజ్ఞలో ప్రవేశించును. ఆ సమయమున పరిమితమగు ప్రత్యేక ప్రజ్ఞకు మగత కలుగును. మగత కలుగుట యనగా ప్రజ్ఞ తన సహజస్థితి నుండి వాయుస్థితి పొందుట. ఈ మగత ప్రత్యేక ప్రజ్ఞకు కలుగు బలహీన స్థితి. ఒక రకమైన నిద్రా స్థితి. ఇది మొదట మూడు రకములుగ నుండును. అవి వరుసగా వాయురూప మగత, ఉద్భూత మగత, విధృత మగత.

**1. వాయురూప మగత :** సాధన జరుగుచున్నపుడు కొన్ని ఆలోచనలు ఆవిరిగా మారి వాయుస్థితి పొంది జీవప్రజ్ఞలో ఒక మూల గూడు కట్టుకొని యుండును. దీనివలన మగత ఏర్పడును. అది అగ్నిని ఆవరించిన పొగవలె నుండును. అట్టి స్థితిలో కూడ ప్రజ్ఞ నుండి ఆలోచనలు జరుగుచునే యుండును. అవి జాగ్రతావస్థలో జ్ఞప్తికి రావు. కాని సూక్ష్మ శరీరము మీద పనిచేసి, కలల రూపములో బహిర్గత మగుచుండును.

**2. ఉద్భూత మగత :** ఈ మగత ప్రార్థనయందేగాక ఏకాంతముగ నున్నపుడు కూడ పనిచేయును. సాధకు డేకాంత ముగ నున్నపుడు మెఱపువలె కొన్ని భావము లతనికి అందుచు నుండును. వాటి ననుసరించుటకు సాధకుడు కృషి చేయవలెను.

కుండలినిని శుద్ధప్రజ్ఞ ప్రచోదనము చేయుటచే యిట్టి మగత లేర్పడును.

**3. విధృత మగత :** ఇది కూడ నిద్రావస్థవలె మత్తుగ నుండును. కాని ప్రజ్ఞకు వినపడుట, కనపడుట, పరిసరములతో సంబంధము లేక జరుగును. జాగ్రతావస్థలోనికి వచ్చినపుడు మాత్రము మగతలో తెలిసిన విషయములు అసంబంధిత మనిపించును. కాని సత్యములే.

## 20. మగత - పరిధి - కేంద్రము

మానవప్రజ్ఞ తన కేంద్రమునుండి పనిచేసినచో మగత వుండదు. కేంద్రమునకు పరిధి యుండును. పరిధి నుండి ప్రజ్ఞ పనిచేసినచో మగత ఏర్పడును. కేంద్రమునందు 360 డిగ్రీలు యిమిడి యుండును. పరిధియందు అవి 360 భాగములుగ విడిపడి యుండును. పరిధి యందు పనిచేయు ప్రజ్ఞ ఒక భాగము నుండి మరియొక భాగమునకు పయనించునపుడు కొంత వ్యవధి ఏర్పడి ఆ వ్యవధిలో ప్రజ్ఞ ఆవిరి అయిపోవుచుండును. అనగా ప్రజ్ఞ చలన స్థితిలో ఆవిరి అయి, మగత యగును. తత్కారణముగ నిద్రవంటి స్థితి ఏర్పడును.

అపరిమితమగు శుద్ధప్రజ్ఞ మానవ ప్రజ్ఞా కేంద్రములోనికి ఆహ్వానించినచో మగత యుండదు. అట్లుగాక మానవ ప్రజ్ఞా పరిధి లోనికి ఆహ్వానించినచో మగత ఏర్పడును. అపరిమిత శుద్ధప్రజ్ఞ యనగ "మాస్టర్ ప్రజ్ఞ" అని తెలిపియుంటిని. మాస్టరుగారి ప్రజ్ఞను మన హృదయములోనికి ఆవాహనము చేసుకొనుట, అట్లావాహనము చేయునపుడు ప్రజ్ఞ పూర్ణ ఎరుకతో హృదయము నందుండుట ముఖ్యము. అనగ, మహా వాక్యమును పలుకునపుడు మనస్సు

ఎచ్చటనో నుండక, హృదయమున నిలిపి, శ్రద్ధా స్ఫూర్తులతో మాస్టరు చైతన్యమును ఆవాహనము చేయవలెను. అట్లు చేయక కొంత యథాలాపముగ, పరధ్యానముగ ఆవాహనము చేసినచో మాస్టరు గారి ప్రజ్ఞ, మన ప్రజ్ఞాకేంద్రము వరకు ప్రవహింపక, మన ప్రజ్ఞా పరిధిని మాత్రమే స్పృశించును. అట్లు స్పృశించినపుడు మాస్టరు చేయు సర్దుబాట్లు పరిధిలో జరుగును గనుక మగత కలుగునని, మానవ కేంద్రముతో సంబంధము లేకపోవుట వలన, జరుగుచున్న సర్దుబాట్లయందు సాధకున కవగాహనము లేక నిద్ర వచ్చునని తెలియవలెను.

మాస్టరు ప్రజ్ఞ మన ప్రజ్ఞాకేంద్రము లోనికి ఆవాహనము చేయబడినపుడు మాస్టరుగారు చేయు సర్దుబాట్లు సాధకుని ఎరుకలో జరుగునని తెలియవలెను. "పరిధి యందున్నప్పుడు కేంద్రము నందుండడు. పరిధి యందుండక, కేంద్ర మందున్నప్పుడు మగత యుండదు. కేంద్రమున సర్వము అవగతమే. పరిధియందు సర్వము అయోమయమే." అనునది మాస్టరుగారి సూక్తి.

# 21. ప్రజ్ఞ - కేంద్రము - పరిధి

ప్రతిదినము మేల్కాంచిన స్థితిలో మానవుని ప్రజ్ఞ కేంద్రము నుండి పరిధికి పయనించుచు నుండును. వివిధములగు సన్నివేశ ములు, వివిధములగు జీవులతో ప్రతి స్పందనము, వైవిధ్యముతో కూడిన కార్యములు చేయుటలో ప్రతి భావమునకు ఒకమారు కేంద్రము నుండి ప్రజ్ఞ పరిధిలోనికి పయనించుచు నుండును. ఇట్లంతరాత్మ లక్షలమార్లు విదితాత్మయై పరిధిలోనికి వచ్చుట, పరిధిలో సంచరించుట జరుగుచు నుండును. చాలమార్లు ఒక భావము నుండి మరియొక భావమునకు ప్రజ్ఞ మార్పు చెందు చున్నపుడు కేంద్రమును స్పృశింపక, పరిధిలోనే ఒక స్థానము నుండి మరియొక స్థానమునకు చరించుచు నుండును. ఇట్లు చరించుటవలన ప్రజ్ఞ తన బలమును కోల్పోయి, నిద్రావస్థలోనికి ప్రవేశించును. ప్రజ్ఞకు శ్రమ కలుగుట యనగ, అది బలహీన పడుటయే. అపుడు నిద్రించుట జరుగును. భావమునకు, భావము నకు నడుమ ప్రజ్ఞ కేంద్రమును స్పృశించు చున్నచో, ప్రజ్ఞ కలసట కలుగదని తెలియవలెను.

పై వివరణము అవగాహన చేసుకొనగలిగినచో, ప్రజ్ఞా విలాసము మూడు రకములుగ జరుగుచున్నదని తెలియును.

1. ప్రజ్ఞ కేంద్రము నందుండుట, భావము ననుసరించి పరిధికి చేరుట.

2. భావము ననుసరించి పరిధికి చేరిన ప్రజ్ఞ ఆ భావానంతరము కేంద్రమును చేరక మరియొక భావమున ప్రవేశించుట.

3. భావానంతరము ప్రజ్ఞ మరల కేంద్రమును చేరి, మరల మరియొక భావము ననుసరించి పరిధికి చేరుట.

మూడవ విధమున ప్రజ్ఞ పనిచేసినచో సాధకునకు అలసట తక్కువగ నుండును. నిదుర అవసరము కూడ తక్కువగ నుండును. రెండవ విధముగ పనిచేసినచో, అలసట ఎక్కువై నిద్ర ఆవశ్యకత పెరుగుచు నుండును. మొదటి విధమున కేంద్రమున స్థిరపడి యుండి, భావ వ్యాప్తిని గావించి, భావానంతరము కేంద్రమున నున్నచో, నిద్ర ఆవశ్యకత చాల తగ్గును. ప్రార్థన సమయమున కూడ మగత తగ్గును.

ప్రార్థన యందు మాస్టరుగారిని సాధకుడు తన స్వస్థాన మగు హృదయ కేంద్రమున ఆశీనుడై ఆహ్వానించవలెను. తన ఆహ్వానమును మన్నించి, హృదయమందు ఏర్పరచిన వేదికపై మాస్టరు గారు ఆశీనులైనట్లు భావించవలెను. మాస్టరుగారు అనుగ్రహింపగ తన హృదయము కేంద్రముగ తనయందన్ని సర్దుబాట్లు జరుగు చున్నట్లు, అట్టి సర్దుబాట్లకు మాస్టరుగారు ప్రజ్ఞాప్రసారము

గావించినట్లు భావించవలెను. తాను హృదయమున నుండియే, స్థితిగొని తనయందు జరుగుచున్న ప్రజ్ఞా ప్రసారము, అట్టి ప్రసారము కారణముగ జరుగుచున్న సర్దుబాట్లు గమనింపవలెను. హృదయమున నుండియే గమనించుట ముఖ్యము. సర్దుబాట్లు జరుగుచున్న దేహ భాగముల వద్దకు తాను హృదయము నుండి వ్యాపించవలెనే గాని, హృదయమును వీడి పోరాదు. ఇదియొక ముఖ్య సూచనగ సాధకుడు ప్రార్థనా సమయమున పరిగణించ వలెను.

సాధారణముగ ప్రార్థన యాంత్రికమైనపుడు సాధకుడు స్వస్థానమున తా నాశీనుడైనట్లు భావింపడు. మాస్టరుగారిని ఆహ్వానించునపుడు తాను స్థితిగొనియున్న స్వస్థానమునకు మాస్టరు గారు ఏతెంచినట్లు భావింపడు. ప్రార్థనా సమయమున ప్రజ్ఞను స్వస్థానమున ఉంచుటకు ప్రయత్నింపడు. ఈ మూడు కారణము లుగ ప్రార్థన యొక్క ప్రధాన ప్రయోజనము నిర్వర్తింపబడదు.

ప్రార్థన యందు భావములు కలిగినపుడు, భావముల పుట్టుక చోటు అయిన తన ప్రజ్ఞాకేంద్రమును వీడి, సాధకుడు తిరుగును. భావ పరంపరలతో తిరుగు సాధకుడు పరిధిలో చక్రగతి పొందునే గాని, కేంద్రమును చేరజాలడు. కేంద్రము నుండి పరిధికి వ్యాపించినచో, మాస్టరుగారందించిన చైతన్యము తన జీవన పరిధి లన్నింటి లోనికి ప్రసరించును. కేంద్రమును తాను వీడినచో మాస్టరు చైతన్యము, సాధకుని యందు స్థితిగొనదు. పరిధిలోనికి

ప్రసారము కాదు. ఇట్టి వారికి ప్రార్థనయందు సర్దుబాట్లు జరుగవు. పరిష్కారములు రావు. ప్రార్థన యందు అలజడి ఏర్పడుచు, ప్రార్థనపై విముఖత కలిగించ కలదు.

**సూచన :**

ప్రజ్ఞకు స్వస్థానముగ హృదయ పద్మమునుగాని, ఆజ్ఞా కేంద్రమును గాని భావింపవచ్చును.

## 22. ప్రార్థన - స్థితులు - అవస్థితులు

ప్రార్థనా సమయమున మూడు స్థితు లేర్పడుచుండును.

1. తాను ప్రజ్ఞా కేంద్రమున మాస్టరు సాన్నిధ్యమున నుండుట. తత్కారణముగ మాస్టరు చైతన్యము తనలోనికి ప్రసారమగుట.

2. తన ప్రజ్ఞలోనికి ప్రసారితమైన మాస్టరు చైతన్యము, తాను కేంద్రముగ సమస్త దేహకోశములలోనికి ప్రాణము సహాయ ముగ ప్రసరించుట, తత్కారణముగ సర్దుబాట్లు జరుగుట.

3. ఆ దినమునకు వలసిన సర్దుబాట్లు జరిగిన పిమ్మట, ప్రజ్ఞ మాస్టర్ చైతన్య ప్రభావమున తుష్టిని, పుష్టిని పొందుట.

పై తెలిపిన మూడు స్థితులు ప్రార్థన యందు జరుగుటకు సాధకుని యందు అవరోధము లుండగలవు. అవరోధములు గల వారికి భావములు ప్రార్థనా సమయమున మెండై, మూడురకముల పరధ్యానము కలిగించును. అవి ఈ విధముగ నుండును.

1. మొదలు, తుది లేని ఆలోచనలు కలుగుట, ప్రజ్ఞతో సంబంధము లేక ఆలోచనలు కలుగుట, ఆలోచనల నుండి ఆలోచనలు పుట్టుచు, ఆలోచనా పరంపర ఏర్పడుట, కార్యకారణ

సంబంధము లేక పుట్టుచున్న ఆలోచనల కారణముగ మగత కలుగుట, ఆలోచనలు ప్రజ్ఞతో సంబంధము లేక ఏర్పడుటచే, నిద్రా స్థితియందు అవియే అర్థరహితమగు కలలుగ ఏర్పడుట.

2. ఏకాంతముగ ప్రార్థన యందున్నపుడు, అంతవరకు తన యందులేని భావములు కొన్ని మేల్కొంచి కలవర పెట్టుటగాని లేక స్ఫూర్తి నిచ్చుటగాని జరుగవచ్చును. అట్టి స్ఫూర్తిని గమనిక యందుంచుకొనవలెనే గాని, ఆచరణలోనికి కొనివచ్చుట శ్రేయస్కరము కాదు.

3. ప్రార్థనయందు కొన్ని విషయములు వినపడుచున్నట్లు, కనపడుచున్న ట్లనిపించును. అట్టి విషయములు కూడ క్షుణ్ణముగ పరిశీలించుకొననిదే బహిర్గతము చేయుట శ్రేయస్కరము కాదు.

పై మూడు స్థితులు ప్రార్థన యందలి అవస్థితులుగనే గమనించ వలెనని సూచన.

## 23. ప్రాణా ట్రీట్ - వి.పి.ఎస్. - కుండలిని ఖాళీ

జీవుడు జన్మ ఎత్తినపుడు అతని జీవ పరిణామమును బట్టి రాశులు, గ్రహములు, పితృదేవతలు అతనికి తగిన గ్రంథి నిర్మాణము లకు కావలసిన సూక్ష్మశరీరము నేర్పరచి, మరియొక జన్మ కేర్పాటు చేయుదురు. అపుడా జీవి తగిన తండ్రి నుండి తల్లిని చేరి గర్భస్థుడై, శరీర నిర్మాణ కార్యక్రమమును పూర్తిచేసుకొని ప్రథమ శ్వాస ద్వారా హృదయ స్థానము చేరును. జీవప్రజ్ఞ హృదయమును చేరిన అనంతరమే దేహమొక యంత్రముగ పనిచేయుట ప్రారంభ మగును. అటుపైన క్రమముగ పంచేంద్రియములు, మనస్సు పనిచేయుట ప్రారంభమగును. మొత్తము శరీర నిర్మాణమంతయు జీవుని కుండలినియే ఏర్పాటు చేయును. కుండలిని పని ప్రాణమును చిలుకుట, పంచిపెట్టుట. గర్భములో శిశువును ఏర్పాటు చేయునది జీవుని కుండలిని శక్తియే. కుండలిని మూడు శక్తులు కలిగి యున్నది. శరీరము నేర్పాటు చేయుట (Field), గ్రాహక శక్తి నేర్పాటు చేయుట (Feeling), మరమ్మత్తు, మార్పులు చేయుట (Voling). ఈ మూడు శక్తులను మాస్టరుగారు “Field, Feeling and Voling” అనిరి.

తండ్రి శుక్ర శోణితము ద్వారా తల్లి గర్భమున చేరిన జీవుడు శుక్ర శోణిత పదార్థమంతయు పూర్తియగుదాక శరీర నిర్మాణమును కుండలిని శక్తితోనే నిర్మించుకొనును. శుక్రశోణిత బిందుస్థానము లోని పదార్థమంతయు నిర్మాణమునకు ఉపయోగించగ, బిందు వందలి కేంద్రమున ఖాళీ రూపమున కుండలిని నిలచును.

కుండలిని ఖాళీ సంగతి తెలిసిన మాస్టరుగారు ప్రార్థనా సమయమున హృదయ స్థానములో నుండి దిగి, జీవప్రజ్ఞ కుండలిని లోగల ఖాళీలో ప్రవేశించి, ప్రాణమును శరీరములోని అన్ని భాగము లకు అదనముగ పంపి, సాధకునికి పరిపూర్ణ స్వస్థత గావింతురు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారికి స్వయముగ యిట్లు నిర్వర్తించి ఒక్క ప్రార్థనతో పరిపూర్ణ ఆరోగ్యము నొసగినారు. ఇది మాస్టరుగారి యోగమున ఒక విశిష్టమగు యోగ ప్రక్రియ.

# 24. LIFT UP

కుండలిని ఖాళీలోనికి మాస్టరుగారి చైతన్యము ప్రవేశించి, సాధకుని ప్రాణమును బాగుగ చిలుకును. అట్లు చిలుకుట వలన అనంతప్రాణము జీవుని దేహప్రాణమును చేరి, భౌతిక సూక్ష్మ శరీరములకు తుష్టి, పుష్టి కలిగించును. ఈ ప్రక్రియ నెరిగి మాస్టరుగారి ప్రార్థనా మూలమున హృదయమున కావాహనము గావించి మాస్టరుగారే తన (సాధకుని) కుండలిని ఖాళీ లోనికి ప్రవేశించి మహాప్రాణము ద్వారా శరీరమునకు సర్దుబాట్లు చేయు చున్నారని భావించవలెను. జరుగుచున్న సర్దుబాట్లను శ్రద్ధాభక్తు లతో గమనించవలెను. ఈ విధముగ ప్రాణము ద్వారా సాధకుని సరిదిద్ది, సూక్ష్మమును నిలబెట్టుట ఈ యోగమున మరియొక ప్రత్యేకత. కుండలిని ఖాళీలో మాస్టరుగారు చేయు సర్దుబాట్లు కారణముగ పదార్థమంతయు సూక్ష్మాతి సూక్ష్మముగ నెట్టివేయబడి, కుండలిని సూక్ష్మమునందు నిలచును. ఇట్లు కుండలినితోపాటు, జీవప్రజ్ఞకూడ సూక్ష్మమున నిలచును. సూక్ష్మమున నిలచిన కుండలిని మరల స్థూలమున పనిచేసినట్లే క్షేత్రనిర్మాణము, భావము సర్దుబాట్లు సూక్ష్మమున గావించును. అపుడు జీవుడు సూక్ష్మలోక

వాసియై, సూక్ష్మలోకానుభవమును పొందును. సూక్ష్మ శరీరమును దాల్చును. ఇది యంతయు భౌతిక దేహమున నుండగనే జరుగును. అదే విధముగ సూక్ష్మము నుండి కారణ లోకమును చేరుట గూడ జరుగును.

ఈ విధముగ సాధకుని ప్రార్థన ద్వారా ఉద్ధరించుటలో మాస్టరుగారు కుండలిని ఖాళీని పరిపూర్ణముగ వినియోగించి నారు. సాధకుని సామర్థ్యమునకే వదలివేయక, తన యోగశక్తిని సాధకుని ఉద్ధరించుటకై వినియోగించుచున్నారు. ఇట్లు ప్రార్థన ద్వారా ఉద్ధారణము గావించుట మాస్టరుగారి నిర్ణయమే.

"**May he lift up the Earth to the Kings of Beauty**" అని పరమగురువులు ఈ ప్రక్రియనే ఆశంసనముగ అందించి నారు.

## 25. మాస్టరుగారి శ్వాస

సాధారణముగ జన్మించిన శిశువునకు ప్రథమ శ్వాసకు ముందు సూక్ష్మ శరీరము ఉండదు. శ్వాసవలన వచ్చిన ప్రాణశక్తిని కుండలిని శక్తి కవ్వము చిలికినట్లు చిలకడము ప్రారంభించిన తరువాతనే సూక్ష్మశరీరము ఏర్పడును. ఈ శరీరము బాగుగను, పటిష్ఠముగను ఏర్పరచుకొనుటకే ప్రాణాయామాది కార్యక్రమములు పెద్దలచే అనుగ్రహింపబడినవి. ప్రాణశక్తిని శ్వాస ద్వారా అందుకొని చిలుకుట వలన, కుంభక రేచకాది కార్యక్రమములు చేయుట వలన, ఈ శరీరము మరింత బలపడి, భౌతిక శరీర అనంతరము కూడ గాలిలో తేలియాడుచు నుండును. జీవుడా శరీరమందుండి చాలకాలము జీవించనగును.

ఈ సూక్ష్మ శరీరము కూడ సామాన్యులకు సంవత్సర కాలమున జీర్ణమై, మరల జన్మనెత్తుట జరుగుచుండును. ఇట్లు జనన మరణములు వృత్తాకారముగ జరుగుచు నుండును.

ప్రాణశక్తిని కుండలిని ఎంత చిలికినచో అంత పటిష్ఠముగ సూక్ష్మ శరీర మేర్పడి, భౌతిక జీవితమున ఆరోగ్యకరము, శక్తి వంతము, చురుకుదనముగల భౌతిక జీవనము అందించి,

అనంతరము కొంతకాలము సూక్ష్మ శరీరముగ కూడ నుండును. యోగమున ప్రత్యేకముగ ఈ శరీర నిర్మాణమును పటిష్ఠము గావించుకొనుచు, జీవుడందు జీవించుట నేర్చును. కావుననే అట్టి సాధకునకు మరణానుభవము భయంకరముగ నుండక, ఒక స్థితి మార్పుగ గోచరించును.

మాస్టరుగారి యందు ఆదితత్త్వము హృదయమున ప్రవేశించి, అచటనుండి మాస్టరుగారి కుండలిని ఖాళీ లోనికి ప్రవేశించి, ఒక నిరుపమానమైన పద్ధతిలో శ్వాసను నిర్వర్తించినది. తత్కారణముగ, మాస్టరుగారు ఆరు గంటలు శ్వాసను పీల్చుచునే యుండుట, ఆరు గంటలు పట్టియుంచుట, ఆరు గంటలు నిశ్వాస సలుపుట, ఆరు గంటలు శ్వాస పీల్చక యుండుట జరిగినవి. ఇది నమ్మశక్యము కాని విషయము. కాని వాస్తవముగ జరిగినది. దానివలననే మాస్టరుగారి సూక్ష్మశరీర బలమును అవగాహన చేసుకొన వచ్చును. వారు వాయురూపులై శాశ్వతముగ నున్నారని తెలియుట కిదొక తార్కాణము.

నిజముగ ఆదితత్త్వము యొక్క శ్వాసయే ఒక బ్రహ్మ కల్పము. ఆదితత్త్వము నిశ్వాసము సృష్టి నిర్మాణ కాలము కాగ, ఉచ్ఛ్వాసము సృష్టి తిరోధానమై యున్నది. అట్టి ఆదితత్త్వము మాస్టరుగారి యందు ప్రవేశించి, ఒక రోజున ఒక శ్వాసగ నుండుట ఆశ్చర్యపడవలసిన విషయము కాదు.

## 26. పరిపూర్ణత్వము

మాస్టరుగారి జీవితమున ఆదితత్త్వము ప్రవేశించి వారి కుండలిని ఖాళీలోనికి చొరపడి, వ్యాపించి పనులు చేయుటవలన, వారి భౌతిక జీవనమున జరుగవలసిన కార్యమంతయు అమిత వేగముగ జరిగినది. అట్లు జరుగుట వలన జాతక కుండలిని ప్రకారము మాస్టరుగారికి 70 సంవత్సరములు ఆయుర్దాయ మున్నప్పటికి, 30 సంవత్సరముల భవిష్యత్ కార్యక్రమము 11 సంవత్సరములలో నిర్వర్తింపబడి, స్వచ్ఛందముగ దేహమును విసర్జించుట జరిగినది.

వారిలో 11 సంవత్సరములలో జరిగిన మార్పులు అమిత వేగముతో జరిగినవి. దేహమునుండి బయల్వెడలుట, దేహము లోనికి వచ్చుట అను ప్రక్రియ దైనందిన గృహ ప్రవేశము, గృహ నిష్క్రమణముగ సాగినది. తన ననుసరించిన పెంపుడు తల్లి, భార్య, కుమారుడు, శిష్యులకు కూడ తదనుభూతిని పంచిపెట్టిరి. అటుపైన సూక్ష్మమున వ్యాపించి, చిరంజీవులై నిలచినారు.

తాము చిరంజీవులై నిలచుటయే కాక యితరులను కూడ చిరంజీవులుగా ఏర్పరచి, తమయందు నెలకొన్న బ్రహ్మత్వము

వారికిని అనుగ్రహించు జగత్ప్రణాళికను బాధ్యతగా వహించి యున్నారు. తత్కారణముగ జగద్గురువై నిలచియున్నారు.

మాస్టరుగారి జీవ తత్వమందలి తామసిక, రాజసిక, సాత్వికాహంకారములు, వారి కుండలిని నుండి పరిపూర్ణముగ నిర్మూలింపబడుట వలన, వారి కుండలిని 'ఆది' సంకల్పమే నిర్వర్తించుచున్నది. అనగ బ్రహ్మమే సమస్తమును మాస్టరుగారి నుండి నిర్వర్తించుకొను చున్నది. కావున, వారు బ్రహ్మమే అయి నిలచినారు. ఇట్లు జరుగుట పూర్ణయోగము. అది కారణముగనే మాస్టరుగారు "నేను బ్రహ్మమును" అని పలికినారు. ఆ కారణము చేతనే బ్రహ్మము మనబోంట్లను అనుగ్రహించునని, క్రమము తప్పక ప్రార్థన చేయుడని తెలిపినారు. ఇదియొక అద్భుత సన్నివేశము.

రూపు గట్టుకున్న బ్రహ్మము, భూమిపై కొంత కాలము తిరుగుట, అందువలన వారు తిరుమల సన్నివేశముల ననుసరించి వెళ్లుట, శ్రీ వేంకటేశ్వరుని దర్శించినపుడు అది తానేయని తెలియుటవలన, నమస్కరింపక నిలచుట జరిగినది.

## 27. 'చందు' కుండలిని ప్రవేశము

ఒక శిశువు జన్మించినపుడు ఆ జీవుని చంద్రాత్మకమగు భావన తల్లి గర్భమున పెరుగుచుండగ, సూర్యాత్మకమగు ప్రజ్ఞ తండ్రి శిరస్సు నావరించి యుండును. శిశురూపము గర్భమున పెరుగుచుండగ, ఏడవ మాసమునందు సూర్యాత్మకమగు ప్రజ్ఞ కూడ అందుచేరి, 90 రోజులు గర్భనరక మనుభవించిన పిదప ప్రసవము జరుగునని పెద్దలు తెలుపుదురు. మహాత్ము లట్లుగాక, శిశువును ప్రసవించు సమయమున తమను శిశురూపముపై ఆపాదించుకొందురని తెలుపుదురు. మహాత్ములకు జీవ సంబంధిత కర్మ రహితమగుటచే, వారు గర్భనరక మనుభవింప అవసరము లేదు. సామాన్యులు కర్మానుసారము 7, 8, 9 నెలలో (90 రోజులు) గర్భనరక మనుభవించుచు బయల్వెడలుదురు.

బ్రహ్మమై నిలచిన మాస్టరుగారు తమ ధర్మపత్నియైన వెంకమ్మ గారిలో ప్రవేశించిన శిశువు జన్మకర్మల నెరిగి నొక ప్రయోగము గావించిరి. అదియేమన, గర్భమున నున్న శిశు రూపము కుండలిని ఖాళీలోనికి తాను ప్రవేశించిరి. ఆ శిశువు నామము చందు. అతని సూర్యప్రజ్ఞ మాస్టరుగారి శిరస్సుపై

స్థానముగొని యున్నది. ఈ సందర్భమున 'ఆది' సంకల్పముతోనే నిండి, యితర కార్యక్రమములు లేని మాస్టరుగారి కుండలిని వెంకమ్మగారిలోనికి, ఆమెలోనున్న శిశువులోనికి ప్రవేశించినది. అందులకు మాస్టరుగారు తమ శిరస్సుపై ఆవరించియున్న చందు అను జీవితో ఒక ఒప్పందము కుదుర్చుకొని యున్నారు. మాస్టరు గారు చందు సహకారమును కోరినారు. చందు రూపమున గల కుండలినిలో ప్రవేశించి, దానియందు ఆదితత్త్వమును నిలిపి, చందు జననానంతరము 15 నెలలపాటు అనేకానేక ప్రయోగ ములు గావించినారు.

ప్రతి జీవికిని అతని లింగశరీరమున ఆ జీవి సంస్కారము లన్నియు నిక్షిప్తము చేయబడి యుండును. సంవత్సర చక్రమున సంవత్సర పురుషుడు ఒక్కొక్క డిగ్రీ చొప్పున ముందుకు సాగుచుండగ, నిక్షిప్తమైన సంస్కారములు వ్యక్తమగుచు, కర్మఫలముల ననుభవింప చేయును. చందు జీవప్రజ్ఞ యందలి సంస్కారమును మాస్టరుగారు రోజుకొక డిగ్రీ చొప్పున పరిశీలించిరి. ఈ పరిశీలనము పరిపూర్తి యగుటకు 90 దినములు పట్టినది. 90 డిగ్రీలలో జీవప్రజ్ఞ యొక్క పరిధి పరిశీలించనగును. గర్భస్థ శిశువు 90 రోజులలో గర్భము నుండి బయల్వెడలిన తరువాత 30 సంవత్సరములుగ కాలమానము మారును. ఆ పరిశీలనమున జీవుల జన్మల విశేషములు, జీవుడు పొందిన జ్ఞానము, యింకనూ కలిగియున్న అజ్ఞానము తెలుసు కొనిరి. ఇట్లు చందు కుండలినిలో ప్రవేశించి అతని పరిధిని

విస్తారము గావించి, ఊర్ధ్వలోకములలోనికి ప్రవేశింపజేసి, అనేకానేక అనుభవములను చందు కుండలిని శక్తిద్వారా నెరిగి, వివరముగ లోకాలోకముల పరిస్థితులను నోట్సు వ్రాసుకొనిరి.

ఈ ప్రయోగము తరువాతనే మాస్టరుగారు తన అనుయాయుల కుండలిని యందు ప్రవేశించుట, వారికి త్వరితగతిని పరిమిత మగు పరిధిని అపరిమితముగ వ్యాప్తి చేయుట మొదలిడినారు.

## 28. కర్మ - సమర్పణము - సిద్ధి

తనను స్మరించినంతనే తన అనుయాయుల హృదయమును చేరి, అటనుండి అనుయాయుల కుండలిని ఖాళీయందు ప్రవేశించి, కుండలిని ప్రచోదనము కావించి, ఖాళీయందు కవ్వమువలె చిలుకుచు వేడిని పుట్టించి, భావముల యందు, శ్వాసయందు విశిష్టమగు సంచలనములు సృష్టించుచు, జీవులను తరింప జేయుట మాస్టరుగా రొనర్చు ప్రక్రియ.

తాను, స్మరించినవారి కుండలిని ఖాళీయందు ప్రవేశించి సర్వమును నిర్వర్తింతురుగాన, తన యోగమును కుండలిని యోగ మని సంబోధించిరి. కర్మఫలములను కారణములతో సహా కుండలిని మథనమున భస్మీపటలము చేయుదురు గాన, కర్మ ననుభవించి తీరవలెను అనునది తన అనుయాయులకు వర్తింపదని తెలిపిరి. సాగర మథనమువలె కుండలినిని మథనము గావించి, అందుండి వెలువడు శుభసంస్కారములను పరహిత కార్యములుగ ప్రపంచమునకు సమర్పితము చేయుట, అట్లే వెలువడుచున్న అశుభ సంస్కారములను శంకరునివలె తాను హరించుట ఈ యోగమందు గమనింప దగును. ఇచ్చట సాధకుడు ముఖ్యముగ

గమనించవలసిన విషయ మొకటి యున్నది. తన యందలి శుభ సంస్కారములు సత్కార్యములుగ ప్రపంచమున అవతరించు చున్నపుడు తా నహంకారము చెందరాదు. గర్వపడరాదు. అంతయు మాస్టరుగారి అనుగ్రహము అని భావింపవలెను. అట్టి సత్త్వమున సాధకుడు నిలచినచో, తననుండి వెలువడు అశుభ సంస్కారములను కూడ తాను నిర్వికారియై గమనింపవచ్చును. మాస్టరుగారు వాటిని హరించునపుడు కూడ గమనించుచు, వినమ్రతతో వారియందు సమర్పణ చెందవలెను. పుణ్యకార్య ములు, పాపకార్యములు కూడ మాస్టరుగారికే సమర్పించి, తాను నిర్లిప్తుడై మాస్టరుగారి యందే యుండవలెను. ఈ నియమము ననుసరించి, ఈ యోగమును సమర్పణ యోగమనిరి. సమర్పణ మనగ తనను, తనని మాస్టరుగారికి సమర్పించుకొనుటయే. ఇట్టి భావనయందు నిలచినచో జీవప్రజ్ఞ యందు పట్లు, బిగువులు తగ్గి జీవనము ప్రశాంతమై సాగును. మనస్సున పట్లున్నచోట ఆగును.

ప్రతినిత్యము కనీసము రెండుసార్లు మాస్టరుగారిని స్మరించుట, వారిని హృదయములోనికి ఆహ్వానించుట, అటనుండి వారు తన కుండలిని లోనికి ప్రవేశించుట, యోగ కారణమును ప్రచోదనము కావించుట. కారణము జరుగుచుండగ గమనించుట సాధకుని కర్తవ్యమై యున్నది. నిద్ర కుపక్రమించునపుడు కూడ మాస్టరు గారిని స్మరించి నిద్రించినచో కారణము జరుగగలదు.

# 29. MILLER FORM CENTRE

మాస్టరుగారు యిచ్చిన మంత్రములలో, యిదియొక అద్భుత మగు మంత్రము. 'మిల్లర్' అనగ మిల్లు నాడించువాడు. మిల్లనగ పిండిమర. పిండిమర నాడించువాడు మర నాడించుట ప్రారంభించ గనే అందువేసిన పప్పంతయు పిండిగ మారిపోవును. కర్మ సంస్కారమను విత్తనములను మరయందు వేసి ఆడించుటయే మాస్టరుగారి ప్రక్రియ. సంస్కారము లన్నియు పిండికాగ, సాధకుని యందు రజస్సు, తమస్సులు హరింపబడి సత్త్వము మిగులును.

పిండిమర నాడించువాడు మర కీవల యుండి మర నాడించును. మాస్టరుగారు మర నాడించు విధానమునందొక ప్రత్యేకత యున్నది. పిండిమర కార్యమునకు ఆయన బహిర్గత ముగ నుండక, కేంద్రముగ నుందురు. ఆయనయే కేంద్రమై నిలతురు కావున, మిల్లరే సెంటరుగ నిలచినారని తెలియవలెను. అందువలన "మిల్లర్ ఫారమ్ సెంటర్" అనిరి. లోకమున సద్గురువులు కుండలినిని ప్రచోదనము గావించి, అనుయాయుల యోగక్షేమములు పరిరక్షింతురు. కాని మాస్టరుగారు అనుయాయుల కుండలిని యందే ప్రవేశించి సర్వమును నిర్వర్తింతు ననిరి. "నేనే

సర్వమును నిర్వర్తింతును. నన్ను స్మరించి నాకు సమర్పణము చెందుడు" అని మాస్టరుగారు పలికినారు. ఇట్టి గంభీరమగు వాక్యమందలి లోతులు ఎందరు తెలుసుకొనగలరు! సద్గురువులు మార్గము చూపుట కద్దు. తానే లోపల చేరి నడుపుట అరుదు. ఇది నూతనము.

మన కుండలిని ఖాళీలోనికి చేరి అందలి పదార్థమునంత చిలికి బహిర్గతము గావించి ప్రజ్ఞను ఊర్ధ్వముఖముగ నడిపించుట మాస్టరుగారు తెలిపిన "వెర్టికల్ లెవెల్స్". ప్రత్యేగాత్మ సంకల్పము లన్నింటిని బహిర్గతము గావించి, ఆది సంకల్పముతో నింపుట మాస్టరుగారందించు "మీట్ సెంటర్స్". జీవుల నుద్ధరించుటకు మాస్టరుగారు సంకల్పించిన విధానమంతయు ఈ మూడు మంత్రములలో గోచరించును.

## 30. సైన్సు - యోగము - పరిష్కారము

యోగ మంతర్ముఖమగు పరిశోధన. సైన్సు బహిర్ముఖమగు పరిశోధన. యోగము గమ్యము ఆత్మానుభూతి లేక ఈశ్వరానుభూతి. అది ప్రకృతిశక్తుల కతీతము. సైన్సు గమ్యము ప్రకృతిశక్తుల అవగాహన, ఆ శక్తులను వినియోగించుట. శక్తులన్నియు ప్రకృతివే. ప్రస్తుతము మానవుడు అణుశక్తిని కూడ తెలుసుకొని యున్నాడు. సృష్టియందు ప్రతి సృష్టిని కూడ చేయు స్థితికి ఎదుగుచున్నాడు. ప్రకృతి శక్తుల అనుభవమును పరిశోధకులు ప్రయోగాత్మకముగ పొంది, వానిని మానవజాతికి అందించుచున్నారు. సైన్సువలన పొందిన విజయములు, వాని ఫలితములు అందరికిని అందించు అవకాశ మున్నది. ఉదాహరణకు రేడియో, టెలిఫోన్, టెలివిజన్, సెల్ ఫోన్, కంప్యూటర్లు, కార్లు, విమానములు సైన్సు అందించిన సౌకర్యములే.

ఒక శాస్త్రజ్ఞుడు జనబాహుళ్యానికి అందించిన సౌకర్యములు, అనుభవము, ఒక సిద్ధిపొందిన యోగి సాధకులకు ఈయలేని స్థితి యున్నది. సిద్ధిపొందిన యోగి సమాధి అనుభవమును యితరుల కందించలేడు. తాను అనుభవము వివరించుచు యితరులకు స్ఫూర్తిమాత్ర మీయగలడు. ఇది గమనించవలసిన విషయము.

యోగి చేరునది ఆత్మస్థితి. శాస్త్రజ్ఞుడు చేరునది అణుశక్తి. అణుశక్తి ఆత్మశక్తియే. శక్తిని అధిగమించినపుడే ఆత్మానుభవము కలుగును. అణుశక్తి యంతయు త్రిగుణాత్మకమగు శక్తి. సత్త్వము, రజస్సు, తమస్సువలె అణువునందు న్యూట్రాన్, ప్రోటాన్, ఎలక్ట్రాన్ లున్నవి. త్రిగుణముల నధిష్ఠించి శక్తి యున్నది. శక్తి నధిష్ఠించి ఆత్మ యున్నది. దీనివలన తెలియునదేమనగ, శాస్త్రజ్ఞు లందరు శక్తి ఆరాధకులే గాని, దాని మూలమైన పరతత్త్వము నారాధించు వారు కాదు. అనగా శాస్త్రమంతయు ప్రకృతి ఆరాధనమే సలుపును. ప్రకృతిని ఆరాధించువారు త్రిగుణములను దాటిపోలేరు. త్రిగుణాతీతుని పొందలేరు. ప్రకృతియందు సత్త్వమున నిలచుట నామమాత్రముగనే యుండును. సత్త్వమున నిలువవలెనన్నచో తదతీతమగు పరతత్త్వము నారాధించవలెను. అది జరుగునపుడు శక్తి ఆరాధన వలన, ప్రకృతి శక్తులు విజృంభించి, మానవునిపై అధికారము చెలాయించును. అట్టి పరిస్థితికి పరిష్కారము పరతత్త్వ ఆరాధనమే.

పరతత్వమున స్థిరముగ, సుఖముగ నుండుట ప్రధానమగు లక్షణము. ప్రకృతి తత్త్వమున క్రియాశక్తి ప్రధాన లక్షణము. క్రియా శక్తిని నమ్మిన విశ్వామిత్ర మహర్షి, పరతత్త్వమును చేరిన వశిష్ఠ మహర్షుల కథలను గమనించినచో, విశ్వామిత్రునియందు రజో గుణ ప్రభావము, తత్ఫలితమగు సంచలనము, ఆవేశము, క్రోధము గోచరించును. వశిష్ఠునియందు గంభీరమగు శాంతము, సుఖము,

నిశ్చలత గోచరించును. దాని కాకర్షితుడైన విశ్వామిత్ర ఋషి శక్త్యారాధనము విసర్జించి, బ్రహ్మమునకై తపస్సు చేసి బ్రహర్షియై శాంతిని, దాంతిని పొందెను.

ప్రస్తుతము మానవజాతి విశ్వామిత్రునివలె శక్త్యారాధనము చేయుచున్నది. శక్త్యారాధకులను అసురశక్తి మిక్కుటముగ వాడు చున్నది. అందువలన ప్రమాదము హెచ్చుగ గోచరించుచున్నది. అణుశక్తి ఎంత అవసరమో, ఆత్మశక్తి కూడ అంత అవసరము. నిజమునకు ఆత్మశక్తి అధీనమున అణుశక్తి యున్నచో, సర్వము శుభంకరము కాగలదు. ఆత్మశక్తి స్థిరత్వమును, పూర్ణత్వమును, ఆనందమును కలిగించును. అణుశక్తి విజృంభణము కలిగించును. అణుశక్తిపై ఈశ్వరత్వమే నిజమగు యోగసిద్ధియై యున్నది. అది జరుగవలెనన్నచో యోగమే పరిష్కారము. కాని అట్టి యోగము జనబాహుళ్యమునకు సిద్ధి కలిగింపలేదు. క్రమముగ ఒక్కొక్క వ్యక్తియే, సిద్ధి పొందవలె నన్నచో అనంతకాలము పట్టును.

పై కారణమున ఈ నూతన యోగము ఆవిర్భవించి జాతి నంతను నొక్కమారు ఉద్ధరించవలెనను మహత్కార్యము, బ్రహ్మము నుండే సంకల్పింపబడినదని మాస్టరుగారి అవగాహన.

## 31. కదలిన బ్రహ్మము

సాధారణముగ యోగసాధనమందు జీవుడు ప్రకృతి నవావరణలు దాటి పరమును చేరును. ప్రకృతి ఆవరణలయందు మహత్తరమగు మాయ ఆవరించి యుండుటచే, ఈ ఆవరణలు దాటుట సాధకునకు అసాధ్యమగు చున్నది. మాయలో పుట్టిన జీవుడు, మాయను దాటుట కష్టతరమైన విషయము. మాయాధీనము ననే సృష్టిజీవులను ప్రకృతి నడిపించుచు నుండును. మహత్తర మగు జ్ఞానులు కూడ, పలుమార్లు మాయచే హింసింపబడిరని పురాణగాథలు తెలుపుతున్నవి. పెంచిన తల్లి, పిల్లలు తన అదుపాజ్ఞలను అతిక్రమించి పోవుట సహింపలేదుకదా! మహత్తర మగు విషయములన్నియు ప్రకృతివే. శక్తులు ప్రకృతివే. వాని ననుభవింపక నిర్వికార ఈశ్వర స్థితి జీవులకు కల్గించుటకు ప్రకృతి సమ్మతింపదేమో అనిపించును. శంకరునివలె నిర్వికారులై, విభూతిధారులై, జటాజూటధారులై, దిగంబరులై, శాశ్వతులై తన అధీనము తప్పి, తన సృష్టివైభవమున కతీతముగ జీవులుండుటకు ప్రకృతిమాత అంగీకరించదేమో? ఆదిశంకరులు తమ ఏడవ సంవత్సరమున సన్యాసముకోరగ, తల్లి అంగీకరింపలేదు కదా!

నిజమునకు ఏ తలిదండ్రులు తమ బిడ్డ సన్యసించుట కంగీక రింతురు? సర్వము తెలిసిన శుద్ధోధన మహారాజు, తన కుమారుడు సన్యాసి యోగమును కలిగియున్నాడని తెలిసియు, సర్వవిధము లగు ప్రయత్నములతో గౌతముని కట్టడి చేయ ప్రయత్నించెను కదా!

ప్రకృతి తన ధర్మమును తాను నిర్వర్తించును. తత్కారణ ముగ జీవులు నవావరణమునందే తిరుగుచు నుందురు. సుఖ శాంతులను కూడ ఈ ఆవరణలయందు పొందవచ్చును. కాని మాయా మోహములు కలుగక తప్పదు. పరిమితత్త్వము తప్పదు. జీవుడు సహజముగ స్వతంత్రమును, అపరిమితత్త్వమును అభిలషించును. కారణము అతడు పరమాత్మ అంశ అగుటయే. అందుచే తల్లి నెరిగిన కుమారుడు, తండ్రిని చేరవలెనను ఆరాట ముండుట పరిణామ క్రమమున జరుగును. అట్టి జీవుడు కోటి కొకడు గాని కనబడడు. అందువలననే శతాబ్దమునకు పదిమంది కన్న ముక్తజీవులు గోచరింపరు.

ఈ పరిస్థితిని గమనించిన బ్రహ్మము, ప్రకృతి నవావరణలు తానే దాటి స్థూల శరీరమందలి మూలాధారకేంద్ర అంతర్గతమున నున్న కుండలిని చేరి తనకు తానే జీవులను ఉద్ధరించుకొనుట ఆరంభించినదని, అదియే ఈ నూతన యోగమని శ్రీ మాస్టరుగారు వివరించిరి.

## 32. యోగార్హతలు

1. మాస్టరుగారి యోగము పాటింపదలచినచో ఈ యోగమును గూర్చి పూర్తిగా తెలుసుకొనుచు, చేసుకొనుచుండవలెను. అట్లుకానిచో గ్రుడ్డివాని నడకవలె, గమ్యములేని ప్రార్థన జరుగును. ఇట్టి సాధకులే మెండు.

2. యోగాభ్యాసి యోగజ్ఞానమును గూడ సమకూర్చుకొనుచు ముందుకు సాగవలెను. అవగాహనలేని అభ్యాసము ప్రస్తుత కాలమునకు అనుగుణము కాదు.

3. యోగాభ్యాసికి మానవ దేహనిర్మాణ జ్ఞానము అత్యవసరము. పంచకోశములు, పంచప్రాణములు, పంచభూతములు, పంచ తన్మాత్రలు, పంచేంద్రియములు, పంచ కర్మేంద్రియములతో కూడిన మానవదేహమును పూర్ణముగ తెలుసుకొన వలెను.

4 ఋషి సంప్రదాయమును గ్రహించుట, ప్రాచీన విజ్ఞానమును పెంపొందించుకొనుట యోగాభ్యాసికి చాల వినియోగపడును.

5. సాధకునికి జ్యోతిష జ్ఞానము ఈ యోగమున చాల వినియోగపడును. అట్లే ఆయుర్వేదజ్ఞానము కూడ సమ కూర్చుకొనవలెను.

6. నిశ్చలత, వివేకము, దృఢ సంకల్పము ఆవశ్యకమగు లక్షణములు.

7. మరణము దాటవలెనని, బ్రహ్మత్వమును పొందవలెనని ఆరాటము, ఆవేదన యుండవలెను.

8. అష్టాంగ యోగమందలి యమ, నియమాదులు ఈ యోగమునకు కూడ పరిపూర్ణముగ వర్తించునని తెలియవలెను. వాటియందు మినహాయింపు లుండునని భావింపరాదు.

9. సాధకుని వయస్సు యోగమున ప్రవేశించుటకు 21 సంవత్సరములకు తక్కువగ నుండరాదు. 56 సంవత్సరములకు పైబడి యుండరాదు.

10. సాధకుని కుటుంబ సంప్రదాయమును, మతాచార విధులను అతిక్రమించరాదు.

11. జీవనోపాధికి కొరత లేనివాడై యుండవలెను.

12. దేహారోగ్యము తగు మాత్రముండవలెను.

13. సంఘ శ్రేయస్సునకు విరుద్ధమగు వృత్తి, వ్యాపార, ఉద్యోగములలో యుండరాదు.

14. అధమపక్షము 10 సంవత్సరములైనను దీక్షతో సాధన చేయగల మనస్థైర్యము కలవాడై యుండవలెను.

15. తరచు మనస్సంకటములకు లోనగువారు ఈ యోగమును నిర్వర్తించుకొనలేరు.

16. ఇతరుల స్వరూప స్వభావములను గూర్చి నిర్ణయము చేయు బుద్ధి మానవలెను.

17. లోకమున భిన్న ప్రవృత్తులు, భిన్న అభిప్రాయములు కల వారుందురని, ఏకాభిప్రాయము కుదరదని, అట్టి అభిప్రాయము నాశించుట అజ్ఞానమని తెలిసియుండ వలెను.

18. భిన్నత్వమందు ఏకత్వమును దర్శించు ప్రయత్నము గావించుచు నుండవలెను.

19. పరిష్కారములేని విషయమునందు బాధపడుచు కాలమును వృథా చేయకుండుట ముఖ్యము. తన చేతిలో నున్నంత ప్రయత్నము చేయుచు నుండవలెను.

20. ఇతరులకు ఉపకారము చేయు విషయమున చేతనైనంత చేయుట ముఖ్యము. చేతనైనది చేయకుండుట, చేతకానిది చేపట్టుట తగదు.

21. జీవితమున పట్టు విడుపు లుండవలెను. మూర్ఖత పనికిరాదు.

22. ఇతరుల బలహీనతలను ఉదారముతో మన్నించు దొడ్డబుద్ధి యుండవలెను.

23. పరిమితమగు మనస్సునకు తోచినదే సత్యమని భావించుచు, మూర్ఖతతో ప్రవర్తించుట పనికిరాదు.

24. మనోవికాసమునకు ఎప్పుడునూ ప్రయత్నించుచు నుండవలెను.

25. సాధన దీర్ఘకాలము శ్రద్ధాభక్తులతో చేయక, సిద్ధుల నాశించుట అవివేకము. త్వరపడుట యనగా పొర పడుటయే.

26. ఇతరుల వ్యక్తిగత విషయములయందు కుతూహల ముండ రాదు - ప్రశ్నించి తెలుసుకొను బుద్ధి యుండరాదు. ఎవ్వరైనను తెలుపుకొన్నచో నిరాకరింపరాదు.

27. తన పరివారమున అందరి గూర్చి అన్ని విషయములు మనకు తెలియవలెనని ఆశించుట రాజసిక అహంకార మగును. అది తగదు.

28. భౌతిక జీవనము అనిత్యమని, మరణ మెప్పుడైనను ఆసన్నము కావచ్చునని తెలిసి మనసున సంసిద్ధత కలిగి యుండవలెను.

29. నీ కసాధ్యమైనది, యితరులకు కూడ అసాధ్యమే అనుకొనుట అహంకారము. ఆ భావమును విసర్జించుట శ్రేయస్కరము.

30. ఈ యోగమును మాస్టరుగారు తెలిపిన విధానముననే నిర్వర్తింపుము. ఇతర యోగ సంప్రదాయములు ఈ యోగమున చొప్పించ వద్దు.

31. రోగహరణము కొరకు, దివ్యానుభూతుల కొరకు యోగమును నిర్వర్తించుకొనుట మధ్యరకము. అమృతత్త్వమునకై నిర్వర్తించుకొనుట ఉత్తమము.

32. అధ్యయన జ్ఞానము కన్న, స్వాధ్యాయ జ్ఞానము ముఖ్యము. స్వాధ్యాయము ద్వారా అధ్యయన జ్ఞానమున గల రహస్యములు బోధపడగలవు. అందువలన ప్రార్థన ద్వారా స్వాధ్యాయమును సాధించుట ముఖ్యము. స్వాధ్యాయమనగ తనను తాను అధ్యయనము చేయుట.

33. మీ అభివృద్ధి మీ చేతలయందే యున్నది.

34. నీవు, నీ పేరు, నీ ఊరు, నీ జాతీయత, నీ కులము, మతము, నీ సంప్రదాయము, నీ స్థితిగతులు ధరించి యున్నావు గాని, అవి ఏవియు నీవు కావు అని తెలిసియుండుట ముఖ్యము. ప్రతినిత్యము దీనిని స్మరించినచో నీయందది స్థిరపడును.

35. మాస్టరుగారు అనుమతించినగాని, నీయందెట్టి యోగశక్తులు పనిచేయవు. యోగశక్తులకై ఎదురుచూడక మాస్టరుగారి సాన్నిధ్యమున కెదురుచూచుట ముఖ్యము.

36. ఈ యోగమున అన్ని రోగములు కుదురునని మాస్టరుగారు వాగ్దానము చేయలేదు. యోగమునకు అంతరాయము కలిగించని ఆరోగ్యము మాత్రము అందివ్వబడును.

37. నీ సమర్పణను బట్టి, సంసిద్ధతను బట్టి నీ అన్నమయ, ప్రాణ మయ, మనోమయ కోశములలో గల రుగ్మతలను మాస్టరు గారు సరిదిద్ది, విజ్ఞానమయ కోశమున స్థిర పరతురు. కావున సమర్పణ, సంసిద్ధత, శ్రద్ధ ముఖ్యమగు అర్హతలుగ నున్నవి.

38. యోగమును తీరిక వేళలలో నిర్వర్తించుట, తీరిక లేనపుడు నిర్వర్తింపకుండుట సర్వసామాన్యముగ సాధకులు చేయుదురు. అట్టి వారి కేసాధనయు సిద్ధి నివ్వదు. యోగాభ్యాసమే ప్రధానమై యున్నగాని, మరియొక విధముగ ఈ యోగము సిద్ధించదు.

39. యోగ మిత్రమండలి క్లబ్బు వంటిది కాదు. సరదాకి క్లబ్బుకు వెళ్ళినట్లుగ, మిత్రమండలిని ఒక క్లబ్బుగ భావింపరాదు.

40. యోగ సాధకునకు అతి నిద్ర, అతి పని, అతి తిండి నిషిద్ధము.

# 33. సూచన

1. ఈ యోగమున ప్రవేశించువారు ప్రార్థనానంతరము ప్రార్థనయందు తోచిన విషయములను ఒక డైరీలో వ్రాసు కొనవలెను. అవి మున్ముందు ఉపయోగకరములై వుండును.
2. అపరిగ్రహము, ఆస్తేయము ఆదిగాగల యమ నియమము లను తప్పక పాటింపవలెను.
3. వీలున్నంత వరకు వాక్కు వినియోగమున తగు హెచ్చరికగ నుండవలెను.
4. ప్రార్థన దైనందినముగ, అంతరాయములు లేక సాగవలెను.
5. నూతన యోగ విషయములు రోజు కొకటిగ తీరికగ చదివి ఆకళింపు చేసుకొనవలెను.

# ధనిష్ఠ ప్రచురణలు

## మాస్టర్ పార్వతీకుమార్ గారి రచనలు

| | | |
|---|---|---|
| **1.** | అమనస్కుడు | **30-00** |
| **2.** | అన్వేషకుడు | **100-00** |
| **3.** | అసంగుడు | **25-00** |
| **4.** | అంబరీషుడు | **80-00** |
| **5.** | హెచ్.పి.బి. ఆత్మసాధనా సూత్రములు | **50-00** |
| **6.** | భారతీయ సంప్రదాయము | **20-00** |
| **7.** | గోవు-ప్రాముఖ్యత | **20-00** |
| **8.** | హిమాలయ గురుపరంపర | **30-00** |
| **9.** | దేవాది మహర్షి బోధలు-1 | **60-00** |
| **10.** | దేవాది మహర్షి బోధలు-2 | **100-00** |
| **11.** | మైత్రేయ మహర్షి బోధలు-1 | **60-00** |
| **12.** | మైత్రేయ మహర్షి బోధలు-2 | **100-00** |
| **13.** | మరువు మహర్షి బోధలు-1 | **60-00** |
| **14.** | మరువు మహర్షి బోధలు-2 | **100-00** |
| **15.** | ధనకాముని కథ | **25-00** |
| **16.** | గాయత్రీ మంత్ర అవగాహన | **10-00** |
| **17.** | జ్యోతిర్లింగ యాత్ర | **20-00** |
| **18.** | కథాదీపిక | **40-00** |
| **19.** | గీతోపనిషత్-జ్ఞాన యోగము | **25-00** |
| **20.** | గీతోపనిషత్-ధ్యాన యోగము | **40-00** |

| | | |
|---|---|---|
| **21.** | గీతోపనిషత్-కర్మ యోగము | **20-00** |
| **22.** | గీతోపనిషత్-సాంఖ్య యోగము | **25-00** |
| **23.** | గీతోపనిషత్-కర్మసన్న్యాస యోగము | **20-00** |
| **24.** | గీతోపనిషత్-విజ్ఞాన యోగము | **50-00** |
| **25.** | గీతోపనిషత్-అక్షర పరబ్రహ్మ యోగము | **50-00** |
| **26.** | మన మాస్టరుగారు | **60-00** |
| **27.** | మాస్టరు యోగము - సాధనా సూత్రములు | **80-00** |
| **28.** | మాస్టర్ సి.వి.వి. (జన్మదిన సందేశము) | **30-00** |
| **29.** | మాస్టర్ సి.వి.వి. నూతన యోగము | **20-00** |
| **30.** | మాస్టర్ సి.వి.వి. యోగము | **40-00** |
| **31.** | మాస్టర్ సి.వి.వి. యోగము (కర్మరాహిత్యము) | **20-00** |
| **32.** | ఓం | **100-00** |
| **33.** | ప్రాణాయామము | **20-00** |
| **34.** | సంఘనీతి | **120-00** |
| **35.** | షోడశోపచార పూజ - అవగాహన | **10-00** |
| **36.** | శ్రీదత్తాత్రేయ | **40-00** |
| **37.** | శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు | **100-00** |
| **38.** | శ్రీగురుపాదుకాస్తవము | **50-00** |
| **39.** | శ్రీ శాస్త్రిగారు | **40-00** |
| **40.** | శ్రీకృష్ణనామామృతం | **60-00** |
| **41.** | శ్రీలలిత (10 భాగములు) | **750-00** |
| **42.** | వృత్రాసుర రహస్యము | **-----** |
| **43.** | సాయి సూక్తులు | **80-00** |

| | | |
|---|---|---|
| **44.** | ధర్మవిగ్రహుడు - శ్రీరాముడు | **35-00** |
| **45.** | రుక్మిణీ కళ్యాణము | **100-00** |
| **46.** | మరణరహస్యం-1 (మార్కండేయుడు) | **80-00** |
| **47.** | మరణరహస్యం -2 (సతీసావిత్రీదేవి) | **100-00** |
| **48.** | కుమార సంభవం | **70-00** |
| **49.** | భాగవతమూర్తి భీష్ముడు | **100-00** |
| **50.** | శ్వేత పద్మము | **30-00** |

## ధనిష్ఠ ఇతర ప్రచురణలు

| | | |
|---|---|---|
| **1.** | వినాయక వ్రతకల్పము | **25-00** |
| **2.** | పురాణపురుషుని పూజావిధానము | **20-00** |
| **3.** | శరన్నవరాత్రి పూజా విధానము | **50-00** |
| **4.** | శ్రీ దత్తాత్రేయ పూజా విధానము | **25-00** |
| **5.** | శ్రీ హనుమాన్ చాలీసా | **----** |
| **6.** | శ్రీ మహాలక్ష్మీ పూజా విధానము | **25-00** |
| **7.** | శ్రీ శివ హృదయము | **05-00** |
| **8.** | శ్రీ శివ పూజా విధానము | **35-00** |
| **9.** | శ్రీ సూర్య పూజా విధానము | **20-00** |
| **10.** | శ్రీ వేంకటేశ్వర పూజా విధానము | **30-00** |
| **11.** | శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్రము | **15-00** |
| **12.** | శ్రీ లలితా సహస్రనామ స్తోత్రము | **30-00** |
| **13.** | శ్రీ సుబ్రహ్మణ్య పూజా విధానము | **25-00** |
| **14.** | శ్రీ ఆంజనేయస్వామి పూజా విధానము | **25-00** |

| | | |
|---|---|---|
| **15.** | శ్రీ సౌకుమార్య శతకము | **10-00** |
| **16.** | గజేంద్ర మోక్షణము | **30-00** |
| **17.** | శ్రీ సరస్వతీ పూజా విధానము | **25-00** |
| **18.** | శ్రీ సద్గురు పూజా విధానము | **20-00** |

ప్రతులకు :

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.


ఫోన్ : 0891-2701531, 2509154.


Website : www.dhanistha.org.

info@dhanistha.org.

# ధనిష్ఠ ప్రచురణలు















**ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.**

Phone : 0891-2701531 www.dhanishta.org info@dhanishta.org

“లోకమున సద్గురువులు కుండలినిని ప్రచోదనము గావించి, అనుయాయుల యోగ క్షేమములు పరిరక్షింతురు. కాని మాస్టరు గారు అనుయాయుల కుండలినియందే ప్రవేశించి సర్వమును నిర్వర్తింత ననిరి. “నేనే సర్వమును నిర్వర్తింతును. నన్ను స్మరించి నాకు సమర్పణము చెందుడు” అని మాస్టరు గారు పలికినారు. ఇట్టి గంభీరమగు వాక్య మండలి లోతులు ఎందరు తెలుసుకొనగలరు! సద్గురువులు మార్గము చూపుట కద్దు. తానే లోనచేరి నడుపుట అరుదు. ఇది నూతనము.”

ధనిష్ఠ

ISBN 978-81-89467-86-9